

'చేపల చెరువులకు లైసెన్స్ తప్పనిసరి'

పార్వతీపురం, ఆగస్టు27(ఆంధ్రజ్యోతి): చేపల చెరువుల నిర్వహణకు తప్పనిసరిగా లైసెన్స్ తీసుకోవాలని మత్స్యశాఖ జిల్లా అధికారి పి.తిరుపతయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా ఈ-మత్స్యకార్ లాగిన్‌లో గ్రామ మత్స్యశాఖ అసిస్టెంట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఎకరానికి రూ.వెయ్యి చొప్పున చెల్లించాలని పేర్కొన్నారు. సర్వేయర్ జారీ చేసిన ఆటోక్యాడ్ మ్యాప్, భూమి రెవెన్యూ అడంగల్, పట్టాదారు పాస్‌పుస్తకం, లీజు అగ్రిమెంట్, రూ.పది బాండ్ పేపర్‌పై 80 శాతం నికర చెరువు, 20 శాతం గట్లు వేస్తానని హామీనిస్తూ అఫిడవిట్ ఉండాలని వివరించారు.


కొంపముంచిన ఓటీఎస్

- గత వైసీపీ ప్రభుత్వ నిర్వాకంతో చిక్కుల్లో సచివాలయ సిబ్బంది
- నాడు సర్కారు ఒత్తిడితో ముందస్తుగా లబ్ధిదారుల పేరిట రిజిస్ట్రేషన్లు
- అయితే అత్యధికులు సొమ్ము చెల్లించని వైనం
- కొంతమంది డిజిటల్ అసిస్టెంట్లపైనే ఆ భారం
- నో డ్యూస్ సర్టిఫికెట్ లేక ఇబ్బందులు
- తాజాగా బదిలీలకు అవస్థలు

పార్వతీపురం, ఆగస్టు27(ఆంధ్రజ్యోతి): బదిలీల వేళ సచివాలయాల్లోని డిజిటల్ అసిస్టెంట్లకు కొత్త చిక్కొచ్చి పడింది. గత వైసీపీ ప్రభుత్వం అమలు చేసిన ఓటీఎస్ (వన్ టైం సెటిల్‌మెంట్) అంశం వారికి ఇప్పుడు తలనొప్పి తెచ్చి పెడుతోంది. బదిలీలకు నో డ్యూస్ సర్టిఫికెట్ తప్పనిసరి కావడంతో కొంతమందికి ఏం చేయాలో అర్థం కావడం లేదు. వాస్తవంగా జిల్లాలో బదిలీల ప్రక్రియ ప్రారంభం కావడంతో సచివాలయ సిబ్బంది తమ ప్రయత్నాలు చేస్తున్నారు. తమకు కావాల్సిన స్థానం లేదా కుటుంబానికి అందుబాటులో ఉండే ప్రాంతం కోసం దరఖాస్తులు చేసుకుంటున్నారు. కాగా స్థానచలనం కోరుకునే వారికి సంబంధిత కార్యాలయాల్లో ఎటువంటి బకాయిలు గాని రిమార్కులు గాని ఉండకూడదు. ముఖ్యంగా సిబ్బందికి నో డ్యూస్ సర్టిఫికెట్ ఉంటేనే బదిలీలకు అర్హులు. లేకుంటే స్థానభ్రంశం కష్టమే. ఈ నేపథ్యంలో గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేసే కొంతమంది డిజిటల్ అసిస్టెంట్లు తలలు పట్టుకుంటున్నారు. మొత్తంగా బదిలీల సమయంలో బయటపడిన ఈ భాగోతం.. సర్వత్రా చర్చనీయాంశమవుతోంది.

ఇదీ పరిస్థితి..

గత వైసీపీ ప్రభుత్వం వన్‌టైం సెటిల్‌మెంట్ (ఓటీఎస్)ను తెరపైకి తెచ్చింది. గత ప్రభుత్వాల హయాంలో మంజూరైన ఇళ్లకు, ఖాళీ స్థలాల్లో నిర్మించిన వాటికి సర్వహక్కులు కల్పిస్తామని ప్రకటించింది. ఈ మేరకు గ్రామాల్లో రూ. 10 వేలు, పట్టణాల్లో రూ.20 వేలు చొప్పున చెల్లించాలని తెలిపింది. ఓటీఎస్ ధ్రువీకరణ పొందిన తర్వాత బ్యాంకుల ద్వారా రుణాలు కూడా పొందొచ్చని, ఏ అవసరాలకైనా లబ్ధిదారులు తమ ఆస్తులను విక్రయించుకోవచ్చని స్పష్టం చేసింది. గతంలో ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారుల నుంచి చలానా, నగదు రూపాల్లో ప్రభుత్వానికి డబ్బులు చెల్లించాలని ఆదేశాలు జారీ చేసింది.



అంతేకాదు దీనిపై సచివాలయ సిబ్బందికి టార్గెట్స్ విధించింది. గ్రామ సచివాలయ డిజిటల్ అసిస్టెంట్‌తో పాటు వార్డు సచివాలయ ఎడ్యుకేషన్ డేటా ప్రాసెసింగ్ ఆపరేటర్లు, సచివాలయ కార్యదర్శులు, ఇన్‌చార్జిలను ఒత్తిడికి గురిచేసింది. దీంతో కొంతమంది సిబ్బంది టార్గెట్స్ పూర్తి చేసేందుకు.. లబ్ధిదారుల పేరిట చలానాలు రిజిస్ట్రేషన్ చేయించారు. ఆ తర్వాత ఓటీఎస్ నగదు కట్టాలని సదరు లబ్ధిదారులపై ఒత్తిడి పెంచారు. అయితే జిల్లాలో అత్యధికులు ఓటీఎస్ కట్టేందుకు విముఖత చూపించారు. ఎప్పుడో నిర్మించుకున్న ఇళ్లకు ఇప్పుడు ఓటీఎస్ చెల్లించడమేమిటని అధికారులను నిలదీశారు. దీంతో ముందస్తుగా చలానా రిజిస్ట్రేషన్ చేయించిన సిబ్బందిపై ఆ భారం పడింది. తాజాగా బదిలీల కోసం ప్రయత్నించే వారికి ఓటీఎస్ ఉచ్చు మెడకు చుట్టుకుంది. స్థానచలనం పొందాలంటే నోడ్యూస్ తప్పనిసరి కావడంతో కొంతమందికి ఏం చేయాలో తెలియడం లేదు. జిల్లాలోని 350 సచివాలయాలున్నాయి. గ్రామాల్లో డిజిటల్ అసిస్టెంట్లుగా, పట్టణాల్లో ఎడ్యుకేషన్ డేటా ప్రాసెసింగ్ ఆపరేటర్లుగా సుమారు 323 మంది పనిచేస్తున్నారు.



హక్కు పత్రాలేవీ?

జిల్లా కేంద్రం పార్వతీపురం ఏడో నెంబర్ సచివాలయం పరిధిలో 58 మంది ఓటీఎస్ కోసం డబ్బులు చెల్లించగా 29 మందికి హక్కు పత్రాలు రాలేదు. 21 సచివాలయం పరిధిలో 15 మందిలో ఏడుగురికి నేటికీ హక్కు పత్రాలు రాలేదు. ఇలా జిల్లా వ్యాప్తంగా ఎంతోమందికి మందికి గత వైసీపీ ప్రభుత్వం హక్కు పత్రాలను అందించలేదు.

ముందస్తుగా రిజిస్ట్రేషన్లు

జిల్లాలో సుమారు 757 మంది ఓటీఎస్ కింద రూ.2,45,810 చెల్లించారు. మరో 444 మంది ఓటీఎస్ కింద దరఖాస్తు చేసుకున్నారు. దీంతో వారంతా డబ్బులు చెల్లిస్తారనే నమ్మకంతో.. డిజిటల్ అసిస్టెంట్లు, ఎడ్యుకేషన్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీలు ముందుగా వారి పేరున చలానాలను రిజిస్ట్రేషన్ చేశారు. కానీ ఆయా లబ్ధిదారులు ఓటీఎస్ సొమ్ము చెల్లించలేదు. మరో 1,649 మంది ఓటీఎస్‌కు దరఖాస్తు చేసుకోనప్పటికీ .. వారి పేరున కూడా చలానాలను రిజిస్ట్రేషన్ చేశారు.





సిబ్బంది గగ్గోలు..

గత వైసీపీ ప్రభుత్వ ఒత్తిడి వల్లే తాము సమస్యల్లో ఇరుక్కుపోయామని డిజిటల్ అసిస్టెంట్లు, వార్డు ఎడ్యుకేషనల్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బదిలీలకు నో డ్యూస్ సర్టిఫికెట్స్ కావాలని అడగడంతో ఎవరికి చెప్పుకోవాలో తెలియక వారు గగ్గోలు పెడుతున్నారు. దీనిపై సమాధానం చెప్పలేని పరిస్థితుల్లో ఉన్నామని ఇంకొంతమంది వాపోతున్నారు. గత ప్రభుత్వ నిర్వాకం వల్లే తమకీ పరిస్థితి ఎదురైందని చెబుతున్నారు. మరికొందరు మాత్రం బయటకు చెప్పుకోలేక.. లోలోనే తీవ్రంగా మథనపడుతున్నారు.

నిధులున్నా.. నిర్మాణాలు పూర్తికాలే

- నిలిచిన హాట్ బజార్ పనులు
- దృష్టి సారించని అధికారులు
- గిరిజనులకు తప్పని ఇబ్బందులు

సీతంపేట, ఆగస్టు 27: సీతంపేట మన్యంలో హాట్ బజార్ పనులకు మోక్షం లభించడం లేదు. నిధులున్నా.. నిర్మాణాలు పూర్తికావడం లేదు. దీనిపై సంబంధిత అధికారులు దృష్టి సారించకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వాస్తవంగా మన్యంలో గిరిజనుల అటవీ ఉత్పత్తులను భద్రపర్చుకోవడానికి వీలుగా వారపు సంతల్లో హాట్ బజార్ నిర్మాణాలను చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం భావించింది. ఈ మేరకు 2023లో సీతంపేట ఐటీడీఏకు 12 కేంద్రాలను మంజూరు చేసింది. ఒక్కో కేంద్రం నిర్మాణానికి రూ.5లక్షల చొప్పున మంజూరు చేశారు. ఐటీడీఏ పీవో ఖాతాలో నిధులు జమ చేశారు. పనుల బాధ్యతలను గిరిజన సహకార సంస్థ (జీసీసీ), గిరిజన ఇంజనీరింగ్ శాఖకు అప్పగించారు. అయితే సుమారు ఎనిమిది నెలలు గడుస్తున్నా.. నేటికీ వాటి పనులు పూర్తికాలేదు. సంబంధిత అధికారుల మధ్య సమన్వయ లోపం, పర్యవేక్షణ కొరవడడమే ఈ పరిస్థితి కారణమనే వ్యాఖ్యలు సర్వత్రా వినిపిస్తున్నాయి. అన్నిచోట్లా అర్ధాంతరంగా నిలిచిపోయిన హాట్ బజార్ కేంద్రాల పనులను త్వరగా పూర్తి చేయాలని గిరిజనులు డిమాండ్ చేస్తున్నారు. నిధులు ఉన్నా.. పనులు జరగకపోవడం దారుణమన్నారు. వారపు సంతల్లో అటవీ ఉత్పత్తులను భద్రపరుచుకునేందుకు వీలులేక తీవ్ర ఇబ్బంది పడాల్సి వస్తోందని దీనిపై ఉన్నతాధికారులు స్పందించాలని వారు కోరుతున్నారు. ఈ విషయమై గిరిజన ఇంజనీరింగ్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సింహాచలాన్ని వివరణ కోరగా.. బిల్లుల చెల్లింపుల్లో జాప్యం వల్ల హాట్ బజార్ పనులు సగంలోనే నిలిచిపోయాయని తెలిపారు. ఇటీవల బిల్లులు చెల్లించామని, నిర్మాణాల పూర్తికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.



దోనుబాయిలో అర్ధాంతరంగా నిలిచిపోయిన హాట్ బజారు పనులు



విశేష అలంకరణలో

పైడిమాంబ

విజయనగరం రూరల్, ఆగస్టు 27: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం పైడిమాంబకు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని, ఆలయాన్ని వివిధ రకాల పూలతో అలంకరించారు. వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. మరోవైపు పైడిమాంబ దీక్షాదారులు, ఈవో డీవీ ప్రసాదరావు, దీక్ష పీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు అర్.సూర్యపాత్రో చదురుగుడి ఆవరణలో సమావేశమయ్యారు. మండల దీక్ష, అర్ధమండల దీక్షలను సకాలంలో ప్రారంభించాలన్నారు. ప్రచార రథం, మాలధారణ చేసిన భక్తులు నగరంలో తిరిగేందుకు తగిన అనుమతులు ఇవ్వాలని అడిగారు. కాగా అక్టోబరు 14న తొలేళ్లు.. 15న సిరి సంబరం జరగనున్నాయి. అందుకోసం సన్నాహక కార్యక్రమాలు, సమీక్షలు విస్తృతంగా జరుగుతున్నాయి.



స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహిస్తున్న దృశ్యం

వ్యాధులపై వాడీవేడి చర్చ

- జ్వరాలపై అధికారులను నిలదీసిన ప్రజాప్రతినిధులు
- జడ్పీలో స్థాయీ సంఘాల సమావేశాలు

విజయనగరం టౌన్, ఆగస్టు 27: సీజనల్ వ్యాధులు విజృంభించి, ప్రజలు అవస్థలు పడుతున్నా వైద్యాధికారులు సరైన చర్యలు చేపట్టకపోవడంపై ఉమ్మడి జిల్లాల ప్రజా ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విజయనగరం జడ్పీ సమావేశ మందిరంలో సోమవారం చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అధ్యక్షతన 1, 2, 4, 7 స్థాయీ సంఘాల సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యారోగ్యశాఖపై వాడివేడిగా చర్చ సాగింది. మలేరియా, డెంగ్యూ కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయని, ప్రతి ఇంట్లో జ్వర పీడితులు ఉన్నారని చైర్మన్‌తో పాటు ప్రజా ప్రతినిధులు నిరాశ వ్యక్తం చేశారు. జియ్యమ్మవలస మండలం బట్లభద్ర గ్రామంలో ఇటీవల తల్లీకూతుళ్లు మరణించిన విషయాన్ని ప్రస్తావించారు. విజయనగరం జిల్లాలో స్వైన్ ఫ్లూ కేసు నమోదైందని, వైద్యారోగ్యశాఖ అధికారులు ఏమి చేస్తున్నారని సభ్యులు ప్రశ్నించారు. రోగులు పీహెచ్‌సీలకు వెళ్తే.. పైఆసుపత్రులకు రిఫర్ చేస్తున్నారని, ఇది సరైన పద్ధతి కాదని అన్నారు. కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి మాట్లాడుతూ.. డెంగ్యూ, మలేరియా, విషజ్వరాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వాటిని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. పీహెచ్‌సీల్లో అవసరమైన మందులు, సెలైన్‌లు, పరికరాలు నిల్వ ఉంచాలని, సకాలంలో వైద్యం అందించాలని సూచించారు. విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు మాట్లాడుతూ, ఆసుపత్రుల్లో ఒకే పడకపై ఇద్దరు రోగులను ఉంచే పరిస్థితి ఎందుకొచ్చిందని ప్రశ్నించారు. వసతి సమస్యను తమ దృష్టికి తీసుకువస్తే ప్రత్యామ్నాయం చూపేవారమని చెప్పారు. ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం బాగోలేదన్నారు. జడ్పీ ఉప చైర్మన్ బాపూజీనాయుడు అధ్యక్షతన జరిగిన మూడో స్థాయీ సంఘ సమావేశంలో వ్యవసాయంపై చర్చించారు. కౌలు రైతులకు రుణాలు అందించాలని, పంట బీమా సదుపాయం కల్పించాలని జడ్పీటీసీలు కోరారు. ఉమ్మడి జిల్లాలోని అనాథ శరణాలయాలు, బాలల వసతి కేంద్రాలను తనిఖీ చేసి, వసతి, భద్రతా ఏర్పాట్లపై నివేదికను అందజేయాలని జడ్పీ చైర్మన్ ఆదేశించారు. ఈ సమావేశంలో సీఈవో శ్రీధర్‌రాజా, డిప్యూటీ సీఈవో రాజ్‌కుమార్, ఉమ్మడి జిల్లాల జడ్పీటీసీ సభ్యులు, కమిటీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో విజయనగరం, కురుపాం ఎమ్మెల్యేలు అదితి గజపతిరాజు, జగదీశ్వరి

ఇసుక తవ్వకాలకు ఏర్పాట్లు: కలెక్టర్

పార్వతీపురం, ఆగస్టు27(ఆంధ్రజ్యోతి): భామిని మండలం కాట్రగడ వద్ద ఉన్న ర్యాంపులో గురువారం నుంచి ఇసుక తవ్వకాలకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నీటిపారుదల శాఖాధికారుల ఆధ్వర్యంలో ఇసుక తవ్వకాలు చేపట్టాలని, స్టాక్ పాయింట్‌లో నిల్వ చేయాలని తెలిపారు. బుకింగ్ పాయింట్ వద్ద రేట్ల వివరాలతో బోర్డులు ఏర్పాటు చేయాలని, పోస్టర్లు అంటించాలని సూచించారు. ఇసుక అమ్మకాల్లో ప్రభుత్వం నిర్దేశించిన రుసుములు తప్ప అదనంగా ఎటువంటి వసూళ్లు చేపట్టరాదని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలోని కొమరాడ, సీతానగరం మండలాల్లో ఇసుక అక్రమ రవాణాపై ఫిర్యాదులు వస్తున్నాయని, వాటిపై పోలీస్, రెవెన్యూ శాఖల అధికారులు దృష్టి సారించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జేసీ శోభిక, ఆర్డీవోలు కె.హేమలత, రమణ, ఏఎస్పీ దిలీప్‌కిరణ్, డీపీవో బి.సత్యనారాయణ, వంశధార ఈఈ రామచంద్రరావు, డీటీవో ఎం.శశికుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్థాయి సూక్ష్మ ప్రణాళికలు

పల్లెల అభివృద్ధి కోసం గ్రామస్థాయి సూక్ష్మ ప్రణాళికలు తయారు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఎంపీడీవోలు, వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్షించారు. ఉపాధి హామీ పథకం కింద వివిధ పనులను అనుసంధానం చేసి సరైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలన్నారు. మండలాల్లో సమగ్ర డేటా తయారు చేయాలని సూచించారు. సెప్టెంబరు 15 నాటికి వర్మీ కంపోస్టు కేంద్రాల నుంచి ఉత్పాదకత ఉండాలన్నారు. విధుల నిర్వహణలో అలసత్వం పనికి రాదని తెలిపారు. ప్రభుత్వ లక్ష్యాల సాధనకు అనుగుణంగా పనిచేయాలని సూచించారు.

ఆదివాసీల అభివృద్ధికి చర్యలు ...

ప్రధానమంత్రి జన్‌మాన్ కార్యక్రమం కింద ఆదివాసీల సర్వతోముఖాభివృద్ధికి బాటలు వేయాలని కలెక్టర్ సూచించారు. పీవీటీజీలకు పక్కా గృహాలు ఉండాలని, మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. గిరిజన గ్రామాల్లో విద్య, వైద్యం, తాగునీరు, రోడ్లు తదితర అవసరాలను గుర్తించాలన్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, అర్హులకు సుకన్య సమృద్ధి యోజన ఖాతాలు, ఆరోగ్య కార్డులు జారీ చేయాలని తెలిపారు. పార్వతీపురం ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి మురళీధర్, పార్వతీపురం, పాలకొండ కమిషనర్లు కె.శ్రీనివాస్, ఎస్.సర్వేశ్వరరావు, మలేరియా నివారణా కార్యక్రమం కన్సల్టెంట్ రామచంద్ర పాల్గొన్నారు.

1800 ఎకరాల్లో జీడితోటల పునరుద్ధరణ

పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో 1800 ఎకరాల్లో జీడితోటల పునరుద్ధరణ కార్యక్రమం చేపట్టాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ అన్నారు. సుమారు రెండు వేల ఎకరాల్లో ఉన్న జీడిమామిడి తోటల్లో కొమ్మలను తొలగించే కార్యక్రమం చేపట్టాలని ఆదేశించారు. జీఎల్‌పురంలో 500 ఎకరాలు, కురుపాంలో 540, జియమ్మవలసలో 200, కొమరాడలో 160, సాలూరులో 200, మక్కువలో 100, పార్వతీపురంలో వంద ఎకరాల్లో పునరుద్ధరణ చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. అవసరమైన పనిముట్లను శత శాతం రాయితీపై అందిస్తామని, కూలి ఖర్చులు కూడా ఇవ్వనున్నట్లు తెలిపారు. ఉద్యాన, సెరికల్చర్, సూక్ష్మ సేద్యం రంగాల్లో వివిధ పథకాలను రైతులకు చేరువ చేయాలని ఆదేశించారు. పూర్తి వివరాలకు ఈ 94927 45405 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

సబ్సిడీపై తుంపెర సేద్యం పరికరాలు

సబ్సిడీపై తుంపెర సేద్యం పరికరాలను అందిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రతి రైతుకు ఏపీ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు తరఫున చిన్న, సన్నకార రైతులకు (ఐదు ఎకరాలు)లోపు 55 శాతం రాయితీ, పెద్ద రైతులకు (ఐదు ఎకరాల నుంచి 12.5 ఎకరాలు) వరకు 45 శాతం చొప్పున ఇప్పటికే రాయితీ అందించినట్లు చెప్పారు. దీనికి అదనంగా ప్రతి గిరిజన రైతుకు రూ.7,172 ఐటీడీఏ తరఫున రాయితీ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఒక ఎకరా భూమి, బోరుబావి, ఆయిల్ ఇంజన్, సోలార్ పంపు ఉన్న గిరిజన రైతులు ఆధార్ కార్డు, వన్‌బీ, బ్యాంకు అకౌంట్, గుర్తింపు కార్డు, ఫోన్ నెంబర్‌తో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

జ్వరాల వివరాలు అందించండి

- ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో విజయపార్వతి

పార్వతీపురం, ఆగస్టు27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రైవేట్ ఆసుపత్రుల్లో నమోదవుతున్న జ్వరాల వివరాలు అందించాలని ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో కె.విజయపార్వతి మంగళవారం ఓ ప్రకటనలో ఆదేశించారు. సాధారణ జ్వరాలు, మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా, టైఫాయిడ్ ఇతర రోగుల సమాచారాన్ని తక్షణమే జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాలయానికి తెలియజేయాలన్నారు. ప్రసవాలు అబార్షన్లు, కుక్క, పాము కాట్లతో పాటు అన్ని కేసుల వివరాలు, జాతీయ ఆరోగ్య కార్యక్రమాల సమాచారం కూడా అందించాలని పేర్కొన్నారు. లేకుంటే ఆసుపత్రుల రిజిస్ట్రేషన్, లైసెన్స్ రద్దు చేస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మలేరియా, డెంగ్యూ తదితర వాటికి సరిపడా మందులు ఉన్నాయని, జ్వరాలు అదుపులో ఉన్నాయని ఆమె చెప్పారు. పార్వతీపురం జిల్లా కేంద్రాసుపత్రి, పాలకొండ ఏరియా ఆసుపత్రిలోనే డెంగ్యూ నిర్ధారణ జరుగుతుందని డీఎంహెచ్‌వో తెలిపారు.

3కే రన్నింగ్ పోటీలకు ఆహ్వానం

సీతంపేట: జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఈనెల 29న రన్నింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో వీవీ రమణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీతంపేటలోని ఎన్టీఆర్ గ్రీన్ ఫీల్డ్ స్టేడియంలో నిర్వహించనున్న ఈ రన్నింగ్ పోటీల్లో పాలకొండ నియోజకవర్గంలోని అన్ని పాఠశాలల విద్యార్థులు పాల్గొనొచ్చని పేర్కొన్నారు. గెలుపొందిన వారికి బహుమతులు అందించనున్నట్టు వెల్లడించారు. అనంతరం ఐటీడీఏ సమావేశం మందిరంలో జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించనున్నట్టు తెలిపారు.

ఎన్‌జీ రంగా వర్సిటీలో పీజీ, పీహెచ్‌డీ

గుంటూరులోని ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ- పోస్ట్ గ్రాడ్యుయేట్(పీజీ), పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. పీజీలో ఎమ్మెస్సీ, ఎంబీఏ, ఎంటెక్ ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. పీజీ కోర్సుల వ్యవధి రెండేళ్లు. పీహెచ్‌డీ వ్యవధి మూడేళ్లు. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వేషన్‌లు వర్తిస్తాయి.



అర్హత వివరాలు: సంబంధిత స్పెషలైజేషన్‌తో మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేసినవారు పీహెచ్‌డీకి అప్లయ్ చేసుకోవచ్చు. పీజీ స్థాయిలో కనీసం 60 శాతం మార్కులు ఉండాలి.

ఎంపిక వివరాలు: ఐకార్ నిర్వహించే ఆలిండియా ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్(ఏఐఈఈఏ)/ఆలిండియా కాంపిటీటివ్ ఎగ్జామినేషన్(ఏఐసీఈ) స్కోర్, అకడమిక్ ప్రతిభ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు.

- పీజీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి ఏఐఈఈఏ స్కోర్‌కు 70%, అకడమిక్ ప్రతిభకు 30% వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేస్తారు.
- ఎంబీఏ ప్రోగ్రామ్‌నకు మాత్రం అకడమిక్ ప్రతిభకు 30%; ఏఐఈఈఏ స్కోర్, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూలకు 70% వెయిటేజీ ఇస్తారు.
- డాక్టోరల్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి డిగ్రీ మార్కులకు 10%, పీజీ మార్కులకు 30%, ఐకార్ ఏఐసీఈ స్కోర్‌కు 50%, ఇంటర్వ్యూకి 10% వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేస్తారు.
- **ఫీజు:** జనరల్, బీసీ అభ్యర్థులకు రూ.1500; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.750
- **దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 13
- **దరఖాస్తు హార్డ్ కాపీ చేరేందుకు చివరి తేదీ:** సెప్టెంబరు 17
- **సర్టిఫికెట్ల వెరిఫికేషన్:** సెప్టెంబరు 18 నుంచి 23 వరకు
- **అభ్యర్థుల మెరిట్ జాబితా విడుదల:** సెప్టెంబరు 24
- **పీహెచ్‌డీ ఇంటర్వ్యూలు:** సెప్టెంబరు 24 నుంచి 27 వరకు
- **ఎంబీఏ ప్రోగ్రామ్‌నకు గ్రూప్ డిస్కషన్స్, ఇంటర్వ్యూలు:** అక్టోబరు 8
- **ఫిజికల్ కౌన్సెలింగ్:** అక్టోబరు 9
- **వెబ్‌సైట్:** angrau.ac.in

దిక్సూచి

Adani Gyan Jyoti

Description: Adani Group is offering this scholarship to first-year students who are domiciles of Andhra Pradesh, Rajasthan, Gujarat, Odisha, and Chhattisgarh and are pursuing courses related to JEE, NEET, CLAT, CA Foundation, and Economics, supporting their educational journey.

Eligibility: Open for candidates who are domiciles of Andhra Pradesh, Rajasthan, Gujarat, Odisha, and Chhattisgarh only. ● Only first-year students pursuing BA Economics, BSc Economics, BEc, B.E./B.Tech., Integrated 5-Year Dual-Degree M.Tech., MBBS, and LLB courses are eligible.

- Applicants must have passed their higher secondary/pre-university/ intermediate/ CBSE/ ISC or equivalent board exams after 2023.
- Admission must be based on the merit rank from state or national-level entrance exams.
- Family income must not exceed INR 4,50,000 per annum from all sources.

Prizes & Rewards: Up to INR 3,50,000 (tuition fee) annually. ***Last Date to Apply:*** 07-10-2024
Application mode: Online application only
Short Url: www.b4s.in/aj/AGSP5

Reliance Foundation Postgraduate

Description: The Reliance Foundation Postgraduate Scholarships aim to enable and propel India's future leaders who can think big, think green, and think digital for the benefit of society.

Eligibility:

- Students who are enrolled in the first-year full-time regular postgraduation programmes pursuing select future-ready courses from Engineering, Technology, Energy and Life-Sciences
- Must have secured 550 to 1,000 in the GATE examination

OR

- Must have scored 7.5 or above in their undergraduate CGPA (or % normalized to CGPA) [If students have not attempted GATE]
- Open for resident Indian citizens.

Prizes & Rewards: Up to INR 6,00,000 over the duration of the degree
Last Date to Apply: 06-10-2024
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/RFS10

SCHOLARSHIP ALERT

Description: HDFC Bank invites applications from students studying in Class 1 to the postgraduate level. The scholarship supports meritorious and needy students belonging to underprivileged sections of society.

HDFC Bank Parivartan's ECSS Programme

Eligibility: The scholarship is open to Indian nationals only. The students must be studying in Class 1 to 12, or pursuing diploma, ITI, polytechnic, undergraduate or postgraduate (including general and professional) courses. The applicants must have passed their previous qualifying examination with at least 55% marks, and their annual family income must be less than or equal to INR 2.5 lakh. Preference will be given to applicants who have experienced personal or family crises in the past three years, preventing them from continuing to bear the cost of education and putting them at risk of dropping out.

Prizes & Rewards: Up to INR 75,000
Last Date to Apply: 04-09-2024
Application mode: Online only
Short Url: www.b4s.in/aj/HDFC54

buddy4study.com

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/PIPo4nXలో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి

'అమ్మ' అధ్యక్ష పదవికి మోహన్‌లాల్ రాజీనామా

- నటి రేవతిపై పోలీసులకు ఫిర్యాదు చేసిన సిద్ధిఖీ
- మీడియా ఆజ్యం పోస్తోంది కేంద్రమంత్రి సురేశ్ గోపి

జస్టిస్ హేమ కమిటీ నివేదిక నేపథ్యంలో మలయాళ చిత్రసీమ మరింత వేడెక్కుతోంది. ఆరోపణలతో మొదలై విమర్శలు, ఖండనలు, రాజీనామాలను దాటి వ్యవహారం కేసుల దాకా వెళ్లింది. మంగళవారం మరికొందరు నటీమణులు 'మీటూ' అంటూ ముందుకొచ్చారు. మల్లూవుడ్‌లో తాము ఎదుర్కొన్న వేధింపులను వారు బయటపెట్టగా, ఆధారాలు చూపాలంటూ వారిపై ఆరోపణలను ఎదుర్కొంటున్న వారు ఎదురుదాడికి దిగారు. ఈ పరిణామాలతో కీలక స్థానాల్లో ఉన్న సినీ ప్రముఖులు సైతం ఆరోపణలకు సమాధానం చెప్పలేక తమ పదవులను త్యజిస్తున్నారు. ఇన్నాళ్లూ చక్కటి అభిరుచితో సినిమాలను తెరకెక్కిస్తూ జాతీయ స్థాయిలో ఖ్యాతిని కూడగట్టుకున్న మలయాళ సినిమా ఇప్పుడు మహిళలపై వేధింపులతో వార్తలతో అపఖ్యాతి మూటగట్టుకుంటోందనేది సగటు ప్రేక్షకుడి ఆవేదన.

మూవీ ఆర్టిస్ట్ అసోషియేషన్ రద్దు

జస్టిస్ హేమ కమిటీ రిపోర్ట్ నేపథ్యంలో నటుడు





మోహన్‌లాల్ ఓ కీలక నిర్ణయం తీసుకున్నారు. అమ్మ(అసోసియేషన్ ఆఫ్ మలయాళం మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్) అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. కీలక వ్యక్తులపై లైంగిక ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో నైతిక బాధ్యతగా ఆయనతో పాటు మరో 17 మంది సభ్యులు తమ పదవులకి రాజీనామా చేశారు. అలాగే, ఈ చిత్రమండలిని రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. కాగా, లైంగిక ఆరోపణల నేపథ్యంలో.. ఇటీవలే దర్శకుడు రంజిత్ బాలకృష్ణన్ కేరళ చలనచిత్ర మండలి అధ్యక్షుడి పదవి నుంచి వైదొలిగారు. నటుడు సిద్ధిఖీ మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ కార్యదర్శి పదవికి రాజీనామా చేశారు. తన పరువుకు భంగం కలిగించారని నటి రేవతిపై ఆయన కేరళ డిప్యూటీ జనరల్ ఆఫ్ పోలీస్‌కు ఫిర్యాదు చేశారు. మలయాళ చిత్రపరిశ్రమలో లైంగిక వేధింపులపై వస్తున్న ఆరోపణలపై కేంద్ర మంత్రి సురేశ్ గోపి స్పందించారు. "చిత్ర సీమలో వస్తున్న లైంగిక ఆరోపణల గురించి మీడియా చేస్తున్న ప్రచారం ప్రజలని తప్పుదోవ పట్టిస్తోంది. స్వలాభం కోసం మీడియా ఇలా వాస్తవాలు తెలియకుండా ప్రచారం చేయడం సరికాదు" అని ఆయన అభిప్రాయపడ్డారు.

ముఖం చూపించి మాట్లాడు

నటుడు, 'అమ్మ' జాయింట్ సెక్రటరీ బాబూరాజ్‌పై ఓ జూనియర్ ఆర్టిస్ట్ ఇటీవలే లైంగిక ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. ఈ ఆరోపణలను ఆయన మంగళవారం ఖండించారు. "ఎవరైతే నాపై ఆరోపణలు చేశారో.. ముఖం చూపించి మాట్లాడాలని సవాలు విసురుతున్నాను" అని పేర్కొన్నారు. అయితే ఇటీవలే ఓ జూనియర్ ఆర్టిస్ట్ బాబూరాజ్‌పై ఆరోపణలు చేశారు. "బాబూరాజ్.. నన్ను ఓ సినిమాలో ఎంపిక చేశానని.. నా పాత్ర కోసం చర్చించడానికి దర్శకులు, నిర్మాతలు వస్తున్నారని.. తన ఇంటికి పిలిచాడు. తన మాటలు నమ్మి నేను వెళ్లాను. కాసేపటికి ఆయన.. సినిమాలో నీ పాత్ర కోసం చర్చలు జరుగుతున్నాయి.. కాసేపు విశ్రాంతి తీసుకోమ్మని ఓ రూమ్ చూపించారు. నేను రూమ్‌లో ఉండగా బాబూరాజ్ బలవంతంగా లోపలికి దూసుకొచ్చి నాపై లైంగిక దాడి చేశారు" అని ఆ జూనియర్ ఆర్టిస్ట్ తన పేరు వెల్లడించకుండా సోషల్ మీడియాలో ఆరోపించారు.

బెంగాలీ ఇండస్ట్రీలోనూ...

మలయాళ పరిశ్రమలోనే కాదు బెంగాలీ చిత్రసీమలోనూ మహిళలపై వేధింపులు ఉన్నాయని నటి రితాభరి చక్రవర్తి ఆరోపించారు. "నాతోటి నటీమణులు, దర్శక, నిర్మాతలు, హీరోల చేతిలో వేధింపులను ఎదుర్కొన్నారు. బెంగాలీ చిత్రసీమలో మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. జస్టిస్ హేమ కమిటీలాంటిదే ఇక్కడా ఏర్పాటు చేయాలి" అని రితాభరి సోషల్‌మీడియాలో బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీని ట్యాగ్ చేస్తూ పోస్ట్ చేశారు.



'ఇంతకుముందు ప్రమోషన్స్‌కు కూడా సమయం కేటాయించాలనే ఆలోచన ఉండేది కాదు. కంటెంట్ సినిమాను చూసుకుంటుందని అనుకొనేవాణ్ని. అది నిజమే అయినా సినిమాను ప్రేక్షకుల దగ్గరకు చేర్చడం మన బాధ్యత. రెగ్యులర్‌గా ఫాలో అయ్యేవారికి సినిమా గురించి ఆటో

నా నిర్మాతలందరూ హ్యాపీగా ఉండాలి

మేటిక్‌గా తెలుస్తుంది. రెగ్యులర్‌గా ఫాలో కాని వారు, ఇతర పనుల్లో బిజీగా ఉండేవారికి కూడా సినిమా సమాచారాన్ని అందించాలంటే ప్రమోషన్స్ పెద్ద స్థాయిలో చేయాలి. సినిమాను చూడాలనే ఆలోచన వారికి కలిగించాలి' అన్నారు నాని. ఆయన హీరోగా నటించిన 'సరిపోదా శనివారం' చిత్రం గురువారం విడుదల కానుంది. ఈ నేపథ్యంలో నాని మీడియాకు వెల్లడించిన చిత్ర విశేషాలివి.

- ఈ సినిమాలో పాయింట్ చాలా రిఫ్రెషింగ్‌గా అనిపించింది. సాధారణంగా నా సినిమాలన్నింటిలో తెలియని బరువుని నేనే మోస్తుంటాను. కానీ ఈ సినిమాలో ఎస్.జె. సూర్య, వివేక్ ఆ బరువు మోశారు. నేను కొంచెం బ్యాక్‌సీట్ తీసుకున్నా. పెర్ఫార్మెన్స్ పరంగా సూర్య, ప్రియాంక, మురళీశర్మ.. ఇలా అందరిపై భారం ఉంది.
- ఈ సినిమాలో సూర్య పోషించిన పాత్రకు ఆయన తప్ప మరో ఛాయిస్ లేదు. అద్భుతంగా నటించారు. నా ప్రతి సినిమాకూ దర్శకుడి దగ్గర అసిస్టెంట్ డైరెక్టర్‌లా పని చేస్తాను. నా నిర్మాతలందరూ హ్యాపీగా ఉండాలని కోరుకుంటాను. సినిమా రిలీజైన తర్వాత అందరూ హ్యాపీగా ఉన్నారని తెలిస్తే సక్సెస్ అయ్యానని ఫీలవుతా.
- ఈ సినిమాకు 'సరిపోదా శనివారం' అని పేరు పెట్టడానికి ఎమోషనల్ రీజన్ ఉంది. నా ఫేవరేట్ మూమెంట్ అది. సినిమా ప్రారంభమైన ఐదు నిముషాలకు వస్తుంది. స్క్రీన్‌ప్లే, నేరేషన్ చాలా ఎక్సయిటింగ్‌గా ఉంటుంది.

ఫ్యామిలీ అంతా కలిసి చూసే చిత్రం



రాజ్ తరుణ్ హీరోగా నటించిన 'భలే ఉన్నాడే' చిత్రం సెప్టెంబర్ 7న విడుదల కానుంది. శివసాయి వర్ధన్ దర్శకత్వంలో ఎన్వీ కిరణ్‌కుమార్ నిర్మించారు. దర్శకుడు మారుతి సమర్పకుడు. ఈ నేపథ్యంలో మంగళవారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో రాజ్ తరుణ్ మాట్లాడుతూ 'శివసాయి సినిమాను డీల్ చేసే విధానం అద్భుతంగా ఉంది. నిర్మాత కిరణ్ ఈ ప్రాజెక్ట్ కోసం ఎంతో సపోర్ట్ చేశారు. మారుతితో పనిచేయాలనే కోరిక ఈ సినిమాతో తీరింది. ఫ్యామిలీ అంతా కలిసి చూసే చిత్రం ఇది' అన్నారు. 'వినాయకచవితి రోజున సినిమాను విడుదల చేస్తున్నాం. పొద్దున్నే పూజ చేసుకుని సాయంత్రం సినిమాకి వచ్చేయండి' అని కోరారు దర్శకుడు శివసాయి. మంచి సినిమా చూశామనే నమ్మకం ఉందనీ, అందరికీ నచ్చుతుందని నిర్మాత కిరణ్‌కుమార్ చెప్పారు.



ఆ కళలో ఆరితేరలేదు

నా సినిమాలకు విస్తృత ప్రజాదరణ లభించేలా ప్రచారం చేసే కళలో నేను నిష్ణాతుణ్ణి కాను అని జాతీయ ఉత్తమ నటుడు, కన్నడ హీరో రిషబ్ శెట్టి అన్నారు. ఆయన స్వీయ నిర్మాణంలో రూపొందిన చిత్రం 'లాఫింగ్ బుద్ధ'. ఈ చిత్రం శాటిలైట్, ఓటీటీ బిజినెస్ పూర్తిగా నిరాశపరిచిందని ఆయన చెప్పారు. 'లాఫింగ్ బుద్ధ' ఈ నెల 30న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా సినిమా ప్రీ రిలీజ్ బిజినెస్ గురించి రిషబ్ ఓ ఇంటర్వ్యూలో స్పందించారు. 'కన్నడ చిత్ర పరిశ్రమలో ప్రీ రిలీజ్ బిజినెస్ ఆశాజనకంగా లేదు. పెద్ద సినిమాలకు సైతం ఈ విషయంలో ఇబ్బందులు తప్పడం లేదు, కొన్ని చేదు అనుభవాల దృష్ట్యా కన్నడ సినిమాలను కొనేందుకు ఓటీటీ వేదికలు ముందుకు రావడం లేదు. 'లాఫింగ్ బుద్ధ' చిత్రానికి ప్రీ రిలీజ్ బిజినెస్ జీరో' అని ఆయన చెప్పారు.

కొత్తగా..

వినోదం పంచే ప్రేమగాథ



నారా రోహిత్ కథానాయకుడిగా నటించిన 'సుందరకాండ' చిత్రం టీజర్ విడుదల కార్యక్రమాన్ని యూనిట్ మంగళవారం నిర్వహించింది. తన స్వప్న సుందరి కోసం అన్వేషించే క్రమంలో ఆయన పండించిన వినోదం అలరించింది. నారా రోహిత్ మాట్లాడుతూ 'ఇదొక వినూత్న ప్రేమగాథ, నా కెరీర్‌లో ప్రత్యేకంగా నిలిచిపోతుంది' అన్నారు. ప్రేక్షకులకు ఆహ్లాదకరమైన అనుభూతిని మా చిత్రం ఇస్తుంది అని దర్శకుడు వెంకటేశ్ నిమ్మలపూడి చెప్పారు.



దసరాకు సూపర్ హీరో

సుధీర్‌బాబు కథానాయకుడిగా అభిలాష్ రెడ్డి కంకర దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'మా నాన్న సూపర్ హీరో'. తండ్రీ కొడుకుల ప్రేమ, అనుబంధం నేపథ్యంలో ఈ చిత్రం రూపొందుతోంది. సునీల్ బలుసు నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ పూర్తి కావొచ్చింది. మంగళవారం చిత్రబృందం విడుదల తేదీని ప్రకటించింది. దసరాకు ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు తెలిపింది. ఆర్ణ హీరోయిన్‌గా నటిస్తున్నారు.

తల్లి మనసుకు అద్దం పట్టే సినిమా



సీనియర్ దర్శకుడు ముత్యాల సుబ్బయ్య సమర్పణలో రూపుదిద్దుకుంటున్న చిత్రం 'తల్లి మనసు'. రచిత మహాలక్ష్మి, కమల్ కామరాజ్, సాత్విక్, సాహిత్య ముఖ్య పాత్రధారులు. షూటింగ్ శరవేగంతో జరుగుతోంది. కీలక సన్నివేశాలను చిత్రీకరించినట్లు దర్శకుడు శ్రీనివాస్ (సిప్పి) చెప్పారు. సింగిల్ షెడ్యూల్‌లో షూటింగ్‌ను పూర్తి చేస్తామని నిర్మాత ముత్యాల కిశోర్ తెలిపారు.

ఐదు భాషల్లో కొటేషన్ గ్యాంగ్



జాకీ ష్రాఫ్, ప్రియమణి, సన్నీ లియోన్, సారా అర్జున్ ప్రధాన పాత్రలు పోషించిన 'క్యూజీ' చిత్రం ఈ నెల 30న ఐదు భాషల్లో విడుదల కానుంది. తెలుగు వరల్డ్ వైడ్ హక్కుల్ని వేణుగోపాల్ సొంతం చేసుకున్నారు. ఇటీవల జరిగిన ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కు ప్రసన్నకుమార్, దామోదర ప్రసాద్ హాజరయ్యారు. ఇది మాస్ మసాలా కమర్షియల్ ఎంటర్‌టైనర్ అని వేణుగోపాల్ చెప్పారు. అద్భుతమైన లోకేషన్స్‌లో చిత్రీకరించిన ఈ చిత్రం అందరికీ నచ్చుతుందని చిత్ర సమర్పకుడు ఎన్టీఆర్ శ్రీను చెప్పారు.

కొత్త కాన్సెప్ట్‌తో కళింగ



ధ్రువ వాయు హీరోగా నటిస్తూ దర్శకత్వం వహించిన చిత్రం 'కళింగ'. ప్రజ్ఞా నయన్ హీరోయిన్. సెప్టెంబర్ 13న ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ధ్రువ వాయు మాట్లాడుతూ 'తెలుగులో ఇంతవరకూ రాని కాన్సెప్ట్‌తో 'కళింగ' రూపుదిద్దుకుంది. ఇది రెగ్యులర్ మూవీ కాదు' అన్నారు. ఈ సినిమాను చాలా వరకూ అవుట్‌డోర్‌లో, ఫారెస్ట్‌లో తీశామనీ, సినిమా అద్భుతంగా వచ్చిందని నిర్మాతలు పృథ్వీ యాదవ్, దీప్తి కొండవీటి చెప్పారు.



నిరుద్యోగి ప్రేమకథ

విప్లవ్ ప్రధాన పాత్ర పోషిస్తూ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'ఈసారైనా'. ఉద్యోగం కోసం వెదుక్కుంటున్న ఓ యువకుడు ప్రేమలో పడడం, చివరకు ఉద్యోగాన్ని పొందాడా, ప్రేమలో విజయం సాధించాడా అనేది ఆసక్తికరమని దర్శకుడు విప్లవ్ చెప్పారు. గ్రామీణ నేపథ్యంలో రూపుదిద్దుకుంటున్న ఈ సినిమాలో అశ్విని అయలూరు హీరోయిన్. సంకీర్త్ కొండ సహ నిర్మాత.

పీఎం విశ్వకర్మ యోజనతో రూ.2లక్షల రుణం

● కలెక్టర్ అంబేడ్కర్

కలెక్టరేట్, ఆగస్టు 27: ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన కింద 18 రకాలు వృత్తులు, చేతివృత్తులు, సంప్రదాయ వృత్తులు చేసేవారికి రూ.2 లక్షల వరకు రుణాలు అందజేయనున్నట్లు కలెక్టర్ అంబేడ్కర్ తెలిపారు. మంగళవారం కలెక్టర్ చాంబర్‌లో ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం జిల్లాస్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం జారీ చేసిన విశ్వకర్మ ఐడీ కార్డు కలిగిన వారికి ఐదు రోజులు ప్రాథమిక శిక్షణ ఇచ్చి అనంతరం 15వేలు టూల్ కిట్ ఇన్సెంటివ్‌గా మంజూరు చేస్తారని, వీరు వ్యాపారం చేసుకోవడానికి బ్యాంకు నుంచి లక్ష రూపాయలు రుణం 5 శాతం వడ్డీతో మొదటి విడతగా ఇస్తారని తెలిపారు. ఈ రుణం 18 నెలల్లో తీర్చవలసి ఉంటుందని, ఈ రుణం తీర్చిన తరువాత 15 రోజులు ప్రత్యేక శిక్షణ ఇస్తారన్నారు. వారికి రూ.2లక్షలు వరకూ 5 శాతం వడ్డీతో రుణం ఇస్తారన్నారు. జిల్లాలోని విశ్వకర్మ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకున్నవారికి సచివాలయంలో పరిశీలన చేస్తారన్నారు. జిల్లాలో ఈ పథకం కింద 5584 దరఖాస్తులు అందాయన్నారు. కార్యక్రమంలో పరిశ్రమల శాఖ డీడీ నాగేశ్వరరావు, డీపీవో శ్రీధర్‌రాజా తదితరులు ఉన్నారు.

పరిశ్రమల్లో భద్రత తప్పసరి..

జిల్లాలో అన్ని పరిశ్రమలు తమ సంస్థల్లో భద్రతకు అవసరమైన అన్ని చర్యలు తప్పనిసరిగా చేపట్టాలని కలెక్టర్ అంబేడ్కర్ తెలిపారు. పరిశ్రమల్లో ప్రమాదాలు జరగకుండా ప్రమాణాల మేరకు భద్రత ఏర్పాట్లను వారం రోజుల్లో పూర్తిచేసి అంతర్గత ఆడిట్ నివేదికను అందజేయాలని పరిశ్రమల యాజమాన్యాలకు సూచించారు. జిల్లాలోని పరిశ్రమల్లో చేపట్టాల్సిన భద్రతపై సమీక్షించేందుకు ఆయా పారిశ్రామిక యాజమాన్యాలతో కూడిన జిల్లాస్థాయి క్రైసెస్ మేనేజ్‌మెంట్ గ్రూపు సమావేశం ఫ్యాక్టరీల తనిఖీ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకే జిల్లాలోని అన్ని పరిశ్రమలు భద్రత చర్యలు చేపట్టడంతో పాటు భద్రత చర్యలపై మాక్ డ్రిల్ నిర్వహించి ఏదైనా ఘటనలు, ప్రమాదాలు జరిగినప్పుడు ఎలా వ్యవహరించాలనే అంశంపై అవగాహన కల్పించాలన్నారు. తనిఖీలు నిర్వహిస్తూ ఆయా పరిశ్రమలు నిర్దేశిత ప్రమాణాల ప్రకారం భద్రత చర్యలు చేపడుతున్నదీ లేనిదీ నిర్ధారించుకోవాలన్నారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ ప్రతి పరిశ్రమకూ ఏదైనా ప్రమాదం లేదా విపత్తు జరిగినప్పుడు తక్షణమే ఎలా స్పందించాలి? ఎలాంటి చర్యలు చేపట్టాలనే అంశంపై ఒక స్పష్టమైన ప్రణాళిక ఉండాలన్నారు. జేసీ సేతు మాధవన్ మాట్లాడుతూ పరిశ్రమలు తమ వద్ద ఉన్న భద్రత ప్రమాణాలను పునఃసమీక్షించుకోవాల్సి ఉందన్నారు. ప్రమాదకరమైన రసాయనాలు నిల్వ చేసే ట్యాంకులు ఉంటే వాటిని తరుచుగా గమనించాలన్నారు. కార్యక్ర మంలో డిప్యూటీ చీప్ ఇన్‌స్పెక్టర్ సురేష్, పరిశ్రమల శాఖ డీడీ కోటేశ్వరరావు, ఆర్‌డీ వోలు సూర్యకళ, శాంతి, సుధారాణి తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ అంబేడ్కర్

పోలీసు కుటుంబాలకు అండగా ఉంటాం

విజయనగరం క్రైం, ఆగస్టు 26: జిల్లా పోలీసు శాఖలో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన పోలీసు ఉద్యోగులు, ఉద్యోగ కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని ఎస్పీ వకుల్ జిందాల్ భరోసా కల్పించారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని సమావేశమందిరంలో పోలీసు కుటుంబ సభ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వీసులో ఉంటూ వివిధ కారణాలతో మరణించిన పోలీసు ఉద్యోగ కుటుంబ సభ్యులకు, ప్రభుత్వం నుంచి రావాల్సిన భద్రత, జీపీఎఫ్, ఏపీజీఎల్ఐసీ, విజో ఫండ్, కార్పస్ ఫండ్, గ్రూప్ ఇన్సూరెన్స్ స్కీం, చేయూత వంటి రాయితీలు సకాలంలో అందే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. పెండింగ్ నిధులు త్వరితగతిన మంజూరు అయ్యే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. విధి నిర్వహణలో మరణించిన పోలీసు కు టుంబాలకు పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలను త్వరితగతిన భర్తీ చేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఏఎస్పీ అస్మాపరహీన్, ఏఆర్ డీఎస్పీ యానివర్, సీఐలు నర్సింహ మూర్తి, లీలారావు, ఆర్ఐ గోపాలనాయు డు, కార్యాలయ సూపరింటెండెంట్ ప్రభాక రరావు, వెంకట లక్ష్మీ, ఆర్ఎస్ఐలు ప్రసాదరావు, ఆలీ, పోలీసు అసోసియేషన్ ప్రతినిధులు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ వకుల్ జిందాల్

మట్టి వినాయక ప్రతిమలను పూజిద్దాం



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

రాజాం, ఆగస్టు 27: మట్టి వినాయక ప్రతిమలను పూజిద్దామని మానవత స్వచ్ఛంద సంస్థ చైర్మన్ కొత్తా సాయి ప్రశాంత్‌కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణ నుంచి మట్టివినాయక ప్రతిమల అవగాహన ర్యాలీని మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ ర్యాలీని ఎస్సై వై రవికిరణ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి స్వప్న హైందవి మాట్లాడుతూ సంప్రదాయాలను ఆచారాలను ప్రతీ ఒక్కరు పాటించాలని, ప్లాస్టిక్ ఆఫ్ పారిస్ తో విగ్రహాలను వాడటంవలన పర్యావరణానికి అనర్థాలు తెస్తుందని ఆమె అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ కరణం హరిబాబు మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకంవల్ల అనేక రోగాల బారిన పడవలిసి వస్తుందని, ప్రతి చిన్న వస్తువు కొనుగోలు చేసినప్పుడు కూడా పాలిథిన్ కవర్లు అడిగి తీసుకోవడం వలన అనారోగ్యం కొనుకున్నవాళ్లం అవుతున్నామని అన్నారు. బీవీ అచ్యుత్‌కుమార్, ఉల్లాకుల నీలకంఠేశ్వరయాదవ్, జాతీయ యువజన అవర్డు గ్రహీత పెంకి చైతన్యకుమార్, విద్యార్థులు తదితరలున్నారు.

సృజనాత్మకతను వెలికితీసేలా పరీక్షలు



పోస్టర్ ప్రదర్శిస్తున్న దృశ్యం

రాజాం రూరల్: విద్యార్థుల్లో ఉన్న శాస్త్రీయ సృజనాత్మకతను వెలికితీసేలా చెకుముకి సైన్స్ పరీక్షలు నిర్వహిస్తామని జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులు స్పష్టం చేశారు. చెకుముకి సైన్స్ సంబరాలలో భాగంగా పట్టణంలోని పోలీస్‌స్టేషన్ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో జెవీవీ ప్రతినిధులు గోడపత్రికను విడుదల చేశారు. ఈసందర్భంగా చెకుముకి సైన్స్ పరీక్షల షెడ్యూల్‌ను విడుదల చేశారు. పాఠశాల స్థాయిలో సెప్టెంబరు 25, అక్టోబరు 1న మండలస్థాయిలో, అక్టోబరు 27న జిల్లా స్థాయిలో, నవంబరు 9, 10 తేదీల్లో రాష్ట్రస్థాయిలో విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వ, ప్రయివేటు పాఠశా లలకు చెందిన తొమ్మిది, పదో తరగతి విద్యార్థులు పరీక్షలు రాసేందుకు అర్హులుగా పేర్కొన్నారు.

సమస్యను పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్తాం

లక్కవరపుకోట: మండలంలోని రంగారాయపురం గ్రామ పంచాయతీ సమస్యను పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశా ఖా మంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకువెళ్లి అధికారులకు ప్రాసిక్యూట్ చేయాలని కోరుతామని మండల తెలుగుదేశం పార్టీ నేతలు తెలిపారు. ఎల్‌కోట లోని ఎమ్మెల్యే నివాసం వద్ద నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. రంగారాయపురం సర్పంచ్ కరెడ్ల రామలక్ష్మి పార్టీ పెద్దలకు మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు చర్యలు ఉంటాయన్నారు. మూడున్నరేళ్లుగా వైసీపీ నేతలు, మండ ల, జిల్లా స్థాయి అధికారులు తనకు చేసిన అన్యాయంపై సర్పంచ్ రామలక్ష్మి ఇటీవల ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ సర్పంచ్‌నని పూర్తి కక్ష సాధింపు చర్యలకు పూనుకుని తమను, తమ కేడర్‌ను ఇబ్బందులు పెట్టారని ఫిర్యాదులో పేర్కొన్నట్టు పార్టీ అధ్యక్షు డు మల్లునాయుడు తెలిపారు. పంచాయతీకి కనీసం అధికారం లేకుండా సర్పంచ్, బాడీ చేసిన తీర్మాణాలు పట్టించుకోకుండా ఏకపక్ష నిర్ణయాలు తీసుకుని అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని తెలిపారు. వీటన్నింటిపై విచారణ జరపాలన్నారు. 2021 నుంచి 2024 గ్రామసభ నిర్వహణ వరకూ అడుగడుగునా అవమానాలు ఎదుర్కొన్నట్లు రామలక్ష్మి ఆధారాలతో ఫిర్యాదు చేసినట్టు మండల నేతలు మాజీ జెడ్పీటీసీ కరెడ్ల ఈశ్వరరావు, మాజీ ఎంపీపీ కొల్లు రమణమూర్తి తెలిపారు. దీనిపై స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారితో మాట్లాడి పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లి బాధ్యులపై చర్యలు తీసుకునేలా కృషి చేస్తామన్నారు.



మాట్లాడుతున్న మండల పార్టీ నేతలు

పంచాయతీ నిధుల వివరాలు ఇవ్వండి

జామి, ఆగస్టు 27: గత ప్రభుత్వ పాలనలో తమ పంచాయతీలో లక్షల రూపాయలు ప్రజాధనం పక్కదోవ పట్టిందని ఆరోపిస్తూ స్థానిక యువత ఇప్పటికే మండల ప్రత్యేకాధికారికి ఫిర్యాదు చేయడంతో పాటు పత్రికలకు పలు వివరాలు అందించారు. అయితే దీనిపై సమాచారహక్కు చట్టం ద్వారా మరిన్ని వివరాలు అందించాలని కోరుతూ మంగళవారం పంచాయతీ కార్యదర్శి ఎర్నమ్మకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా యువకులు జన్నెల బాలకృష్ణ, రాధాకృష్ణ, ఎస్.వెంకటరావు, మాజీ ఎంపీటీసీ నూకరాజు, సత్యం, శ్రీను తదితరులు మాట్లాడుతూ గడిచిన ఐదేళ్లలో చాలా అవినీతి జరిగిందని, దీనిని వెలుగులోకి తెచ్చేందుకు పోరాడుతున్నామని, అవినీతికి పాల్పడిన వారికి శిక్ష పడేలా చేస్తామన్నారు.



వినతినిస్తున్న గ్రామ యువకులు

వైభవంగా కృష్ణునికి పూజలు

వేపాడ: వేపాడలో నూతనంగా నిర్మించిన రుక్మిణీ సత్యభామ సమేత గోపాల కృష్ణాలయం ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు వైభవంగా నిర్వహించారు. మంగళవారం గోపాలకృష్ణ యాదవ యువజన సేవా సంఘం సభ్యులు, గ్రామ పెద్దలు సారథ్యంలో చేపట్టే ఈ ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో వల్లంపూడి, వేపాడకు చెందిన వందలాది మంది పాల్గొన్నారు. అనంతరం రుక్మిణీ సత్యభామ సమేత గోపాలకృష్ణుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటల నుండి ఆలయ ప్రాంగణంలో భారీ అన్న సంతర్పణ ఏర్పాటు చేశారు. యాదవ సంఘం సభ్యులు, గ్రామ పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

తిరునక్షత్ర కృష్ణాష్టమి వేడుకలు

సాలూరు రూరల్: కణ్ణన్ తిరునక్షత్ర కృష్ణాష్టమి సందర్భంగా మంగళవారం కల్యాణ వేంకటేశ్వరస్వామి, పెదకోమటిపేట రామాలయంలో వైభవంగా వేడుకలను నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీకృష్ణునికి పంచామృత అభిషేకాలు చేశారు. ఇరు ఆలయాల్లో రుత్వికులు శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు చేశారు. ఈ పూజల్లో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



సాలూరు రూరల్‌లో..



వేపాడలో..

ఆకతాయిలను ప్రతిఘటించండి

● డీఎస్పీ శ్రీనివాసరావు

బొబ్బిలి, ఆగస్టు 27: సమాజంలో స్త్రీలపై, బాలికలపై, చిన్నారులపై జరుగుతున్న అకృత్యాలను అందరూ సంఘటితమై పోలీసుల సహకారంతో ఎక్కడికక్కడ ధైర్యంగా ఎదుర్కోవాలని బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నతపాఠశాలలో మంగళవారం చిన్నారులపై జరుగుతున్న లైంగిక దాడులకు వ్యతిరేకంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ చెడు స్వభావం కలిగిన వారిని గుర్తించగలిగే సామర్థ్యాన్ని బాలికలు పెంపొందించుకోవాలన్నారు. ఒంటరిగా వెళ్లకుండా సామూహికంగా వెళుతుండాలన్నారు. ఆత్మరక్షణ కోసం కైక్వాండో, కరాటే లాంటి విద్యల్లో ప్రావీణ్యం సంపాదించుకోవాలన్నారు. ఇవి ఆత్మస్థైర్యాన్ని కలిగిస్తాయన్నారు. ప్రేమపేరుతో లొంగదీసుకోవాలనుకునే నయవంచకుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏదైనా ఆపద సంభవించినప్పుడు 100 నెంబరు తక్షణమే డయల్ చేస్తే పోలీసులు వచ్చి రక్షణ కల్పించడమే కాక ఆకతాయిల భరతం పడతారని డీఎస్‌పి భరోసా ఇచ్చారు. బొబ్బిలి సీఐ కటకం సతీష్‌కుమార్ మాట్లాడుతూ చెడుసహవాసాలకు దూరంగా ఉండాలని, తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చేందుకు వారి అభిమతానికి అనుగుణంగా క్రమశిక్షణగా మెలగాలన్నారు. బాల్యం నుంచి యుక్తవయస్సు దాటినవారందరిలో ఆత్మస్థైర్యం మెండుగా ఉండాలన్నారు.

రామభద్రపురం: విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన పెంచుకోవాలని బొబ్బిలి రూరల్ సీఐ నారాయణరావు సూచించారు. స్థానిక కస్తూర్బా గాంధీ విద్యాలయంలో ఎస్ఐ ప్రసాద్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు భద్రత, సామాజిక స్పృహపై అవగాహన కల్పించేందుకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా భద్రతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తూ అనేక రక్షణ చట్టాలు అమలు చేస్తోందన్నారు. వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థినులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఇటీవల సైబర్ నేరాలు ఎక్కువవుతున్న దృష్ట్యా మొబైల్ ఫోన్ వినియోగంలో కూడా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రహదారి భద్రతా ప్రమాణాలు పాటించాలని, కళాశాలల్లో, బస్సుల్లో ప్రయాణించే సమయాల్లో ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్ వంటి అసాంఘిక కార్యకలాపాలు ఎదురైతే ఈవ్‌యాప్ ద్వారా ఫిర్యాదు చేయాలన్నారు. సమావేశంలో కేజీబీవీ ప్రిన్సిపాల్ మీసాల దీప, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

ఉచిత శిక్షణకు నేడు అభ్యర్థుల ఎంపిక

రాజాం, ఆగస్టు 27: ఉచిత స్వయం ఉపాధి శిక్షణకు అభ్యర్థుల ఎంపికను బుధవారం చేపడుతున్నట్లు జీఎంఆర్ నైరడ్‌లో పీవో సి.నాగరాజు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. స్థానిక జీఎంఆర్ నైరడ్‌లో వివిధ అంశాలపై నిరంతరం నిరుద్యోగ యువతీయువకులకు ఉచిత స్వయం ఉపాధి శిక్షణ అందిస్తున్నామన్నారు. 19 నుండి 40 లోపు వయస్సు గల యువత ఈనెల 28వ తేదీన నైరడ్ నిర్వహించే ఇంటర్వ్యూకు హాజరుకావాలని కోరారు. పురుషులకు సెల్‌ఫోన్ రిపేరింగ్, సర్వీసింగ్ (30 రోజులు), రిఫ్రిజిరేషన్, ఎయిర్ కండిషనింగ్ (30 రోజులు)... స్త్రీలకు హోమ్ నర్సింగ్(30 రోజులు), ఇండియన్ రెడ్‌క్రాస్ సంస్థ ద్వారా నెలకు రూ.16వేల జీతంతో ఉద్యోగం, ఉచిత వసతి, భోజనం కల్పిస్తామని పీవో తెలిపారు. ఇంటర్వ్యూకు 10 తరగతి మార్కు లిస్ట్, ఆధార్ కార్డు, పాస్‌పోర్టు సైజు ఫొటోలు తీసుకురావాలని, ఎంపికైన వారికి ఉచిత శిక్షణతో పాటు ఉచిత వసతి, భోజనం, యూనిఫాం, టూల్ కిట్ అందిస్తామన్నారు. పూర్తి వివరాలకు 90147 16255, 9491741129 నెంబర్లుకు సంప్రదించాలని సూచించారు

జీవామృతంతో పంటకు మేలు

రేగిడి: జీవామృతం వినియోగంతో చెరకు, ఇతర సాగుపంటలకు అత్యధిక ప్రయోజనం ఉంటుందని ప్రకృతిసేద్యం రాజాం డివిజన్ ప్రతినిధులు వెంకటలక్ష్మి, ఐసీఆర్‌పి పైల తవిటినాయుడు తదితర్లు పేర్కొన్నారు. మండలంలో చాటాయివలసలో ప్రకృతిసేద్యం యునిట్‌సిబ్బంది పర్యవేక్షణలో జీవామృతం తయారీపై స్థానిక ఈఐడీప్యారీ సుగర్స్ కేన్ సిబ్బందికి క్షేత్రస్థాయిలో చైతన్యకార్యక్రమం నిర్వహించారు. ఘనజీవామృతం, ద్రవజీవామృతం తయారీ, వీటికి వినియోగించిన పదార్థాలు, వినియోగ తీరును సిబ్బందికి వివరించారు. జీవామృత తయారీతీరును షుగర్స్ కేన్ జీఎం రమేష్ పర్యవేక్షించగా, ఈ కార్యక్రమంలో సుగర్స్‌సిబ్బంది, చాటాయివలస రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టీల్ కంచాలు

జామి: మండలంలోని శాసనపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పంచాయతీ సర్పంచ్ బసవ వెంకట అప్పారావు మంగళవారం స్టీల్ కంచాలు అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పైడిపునాయుడు, ఉపాధ్యాయులు రమణ, పంచాయతీ కార్యదర్శి షబీయాబేగం, గ్రామపెద్దలు ఉన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

వేపాడ: వర్షాలు కురుస్తున్నందున గ్రామస్థులు ఇళ్ల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి పట్నాయక్ గ్రామస్థులకు సూచించారు. మండలంలోని పెదకృష్ణరాజపురం శివారు గదబువలస గ్రామాన్ని ఆయన మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామానికి ఉన్న సౌకర్యాలపై గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు.

నేడు కమిషనర్ బాధ్యతల స్వీకరణ

విజయనగరం రింగురోడ్డు: నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య బుధవారం ఉదయం 11 గంటలకు నగరపాలక సంస్థ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించనున్నారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహించిన మల్లయ్యనాయుడిని డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌కి రిపోర్టు చేయాలని ఆదేశించారు. అదే విధంగా విశాఖ జీవీఎంసీలో కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్న నల్లనయ్యని ఇక్కడకు బదిలీ చేశారు. బుధవారం బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన నగరపాలక సంస్థలోని వివిధ విభాగాల అధికారులతో మాట్లాడి, అనంతరం కలెక్టర్ అంబేడ్కర్‌ని కలవనున్నారు.

డీలర్ల సంఘం జిల్లా కార్యవర్గంలో రేగిడినేతలు

రేగిడి: డీలర్ల సంఘం జిల్లా కార్యవర్గంలో రేగిడి మండలం డీలర్ల సంఘం ప్రతినిధులకు చోటుదక్కింది. మంగళవారం జరిగిన ఏకగ్రీవ ఎన్నికల్లో జిల్లా కార్యవర్గ కార్యదర్శిగా వన్నలి డీలర్, మండల డీలర్ల సంఘం అధ్యక్షుడు ఎస్ రామమూర్తినాయుడు, జిల్లా ఉపాధ్యాక్షుడుగా సోమరాజుపేట డీలర్ సీహెచ్ సత్యంనాయుడు ఎన్నికైనట్లు మండల డీలర్లు సంఘం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

యాంత్రీకరణ మేళాకు తరలిరండి

గరుగుబిల్లి: ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయశాఖ సంయుక్తంగా ఈనెల 29న రాగోలులో నిర్వహించే వ్యవసాయ యాంత్రీకరణ మేళాకు మండలం నుంచి ఆసక్తి ఉన్న రైతులు అధిక సంఖ్యలో తరలిరావాలని మండల వ్యవసాయాధికారిణి ఆర్.విజయభారతి కోరారు. మంగళవారం స్థానిక మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఆమె విలేకర్లతో మాట్లాడారు. యాంత్రీకరణ మేళాలో రైతులకు ఉపయోగపడే అన్ని రకాల వ్యవసాయ యంత్ర పరికరాలను ప్రదర్శిస్తారని చెప్పారు.

ఒకేషనల్ విద్యార్థికి ఉత్తమ బహుమతి

రేగిడి, ఆగస్టు 27: ఇంటర్ ఒకేషనల్ కోర్స్(సీఏస్‌ఈ) ప్రథమ సంవత్సరంలో కళాశాల టాపర్ (467మార్కులు)గా నిలిచిన దేవుదల కేజీబీవీ విద్యార్థి ఎ.మహలక్ష్మి విజయనగరం మాన్సాస్ ట్రస్టు నగదు బహుమతికి ఎంపికైంది. ఈమేరకు ప్రిన్సిపాల్ ఎం.లక్ష్మి స్థానిక విలేకర్లకు ఈ విషయం తెలిపారు. రూ.5వేల నగదు బహుమతి, సర్టిఫికెట్ అందించారని చెప్పారు.

రెడ్‌క్రాస్ సొసైటీకి గది కేటాయించండి

శృంగవరపుకోట: శృంగవరపుకోటలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కార్యకలాపాలు నిర్వహించేందుకు ఓ గదిని కేటాయించాలని స్థానిక ప్రతినిధులు డి.సూర్యారావు, డాక్టర్ వరలక్ష్మి, మల్లేశ్వరరావు, జి.ధనుంజయ్ తహసీల్దార్ అరుణ కుమారిని కోరారు. మంగళవారం ఈమేరకు వినతిపత్రం అందించారు.



తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న దృశ్యం

నెల్లిమర్లలో వ్యక్తి ఆత్మహత్య

నెల్లిమర్ల: కుటుంబ కలహాల కారణంగా యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నగర పంచాయతీ పరిధిలోని తామస్‌పేటకు చెందిన అంత్రపల్లి శంకర్‌రావు(30) కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈయనకు భార్య మందాకిని, కుమారుడు, కుమార్తె ఉన్నారు. అయితే భార్యభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో తరచూ గొవడవలు పడుతుండేవారు. ఈక్రమంలో మంగళవారం ఉదయం కూడా జరిగిన గొడవ కారణంగా పోలీసులకు ఫిర్యాదుచేస్తానని చెప్పి భార్య మందాకిని బయటకు వెళ్లడంతో అదే సమయంలో శంకరరావు ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయన తండ్రి సోమరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నెల్లిమర్ల ఎస్ఐ రామగణేష్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం విజయనగరం సర్వజన ఆసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

పూసపాటిరేగ: మండలంలో కొప్పెర్ల సచివాలయానికి చెందిన జూనియర్ లైన్‌మేన్ ఆర్.శ్రీను రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. ఉద్యోగ బాధ్యతల నిమిత్తం పంచాయతీ పరిధిలో కోనాడ జంక్షన్‌కు మంగళవారం బైక్‌పై వెళ్తుండగా ముందు వెళ్తున్న వాహనాన్ని ఢీ కొన్నాడు. ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలవడంతో శ్రీనును స్థానికులు వెంటనే భోగాపురం సామాజిక ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం జిల్లా కేంద్రంలోని ఆసుపత్రికి తరలించారు. ఈయన స్వగ్రామం ఎస్.కోట కాగా ఉద్యోగం నిమిత్తం మండలంలోనే నివాసం ఉంటున్నాడు.

అక్రమంగా తరలిస్తున్న ఇసుక లారీ పట్టివేత

సంతకవిటి: అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని సీజ్ చేసినట్లు సంతకవిటి ఏఎస్సై ఎం.వాసుదేవరావు తెలిపారు. ఎటువంటి అనుమతులు, బిల్లులు లేకుండా లారీలో ఇసుకను హోంజరాం నుంచి తరలిస్తుండగా పోతలజోగుపేట వద్ద పోలీసులు లారీని స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. ఇసుకను తరలిస్తున్న కోరాడ శ్రీనివాసరావును అరెస్టు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏఎస్సై ఎం.వాసుదేవరావు హెచ్చరించారు.

మంచానపడ్డ బాధితునికి బేబీనాయన వితరణ

బొబ్బిలి ఆగస్టు 27: పట్టణంలోని ఎనిమిదో వార్డు రాజానగర్ కాలనీకి చెందిన కార్మికుడు నెల్లి సత్యం అనారోగ్యానికి గురై మంచాన పడ్డాడు. అతనికి స్థానిక ఎమ్మెల్యే బేబీనాయన మంగళవారం ఆర్థిక సాయం అందజేశారు. సత్యం ఎదుర్కొంటున్న ఇబ్బందులను వార్డు కౌన్సిలర్ రాంబార్కి శరత్‌బాబు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన బేబీనాయన పదివేల రూపాయల సహాయాన్ని ఆ వీధి పెద్దల ద్వారా అందజేశారు.

సమాజసేవలో భాగస్వామ్యం కావాలి

రామభద్రపురం, ఆగస్టు 27: సమాజసేవలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని మండల విద్యాశాఖాధికారి ఆమిటి తిరుమలప్రసాద్ కోరారు. మండల పరిధిలోని ఇట్లా మామిడిపల్లి గ్రామంలో ప్రభుత్వ పాఠశాలకు గ్రామానికి చెందిన వారణాశి నాగేంద్రబాబు కుమార్తె హార్దిక రామా పుట్టినరోజు సందర్భంగా రూ.30వేల విలువైన పుస్తకాలు, పెన్నులు, నోటుపుస్తకాలుపంపిణీ చేశారు. పాఠశాలకు అవసరమైన ఫ్యాన్లు, కుర్చీలు, పెన్నులు కూడా సమకూర్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యాభివృద్ధికి పెద్దల సహకారం ఎంతైనా అవసరం అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యంనాయుడు, తెలుగుదేశం మండల పార్టీ అధ్యక్షుడు కరణం విజయబాస్కరరావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఫైడ్ ఆర్బిటర్‌గా జ్వాలాముఖి

విజయనగరం టౌన్: అంతర్జాతీయ చెస్ ఫెడరేషన్ ఫైడ్ ఆర్బిటర్‌గా విజయనగరానికి చెందిన కె.జ్వాలాముఖి నియమితులయ్యారు. ఫైడ్ ఆర్బిటర్ నియామక ప్రక్రియలో భాగంగా ఇటీవల అంతర్జాతీయ చెస్ ఫెడరేషన్ నిర్వహించిన పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించడంతో మంగళవారం ఆయనకు ధ్రువీకరణ పత్రం అందజేశారు. ఇప్పటికే జ్వాలాముఖి రాష్ట్ర చెస్ అసోసియేషన్ ట్రెజరర్‌గా, జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. ఫైడ్ ఆర్బిటర్‌గా జ్వాలాముఖి ఎంపికపై జిల్లా చెస్ అసోసియేషన్ ప్రతినిధులు, క్రీడాకారులు శుభాకాంక్షలు తెలిపారు.

నేత్రదానంపై విద్యార్థులకు అవగాహన

కొత్తవలస: నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా వియ్యంపేటలోని అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో సోమవారం వియ్యంపేట పీహెచ్‌సీకి చెందిన ఆప్తమాలిక్ అధికారి ఈశ్వరరావు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సెప్టెంబర్ 8 వతేది వరకు ఈ పక్షోత్సవాలను నిర్వహించడం జరుగుతుందని ఆయన అన్నారు. మండలంలోని రెండు పీహెచ్‌సీ పరిధిలో గల ప్రాంతాలలోను ఈ అవగాహన కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామని తెలిపారు. అలాగే అవగాహన ర్యాలీలను చేస్తున్నట్టు తెలిపారు. నేత్రదానం చేయడం వలన చూపులేనివారికి చూపు కల్పించవచ్చునన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ జయశ్రీతో పాటు వైద్య సిబ్బందినరసింహారావు, సత్యారావు, పాల్గొన్నారు.

తెలుగునాడు విద్యుత్‌కార్మిక సంఘం సమావేశం

బొబ్బిలి: ఎన్‌జీవో హోమ్‌లో మంగళవారం తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. బొబ్బిలి, పార్వతీపురం బ్రాంచిల పరిధిలో గల ఉద్యోగులంతా ఈ సమావేశంలో పాల్గొన్నారు. బొబ్బిలి డివిజన్ ప్రెసిడెంట్ ఎస్.ఆదిలక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశంలో రీజినల్ అధ్యక్షుడు బి.తేజ ఈశ్వరరావు, కార్యదర్శి కె.జయరాజు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రస్తుతం జరుగుతున్న ఉద్యోగుల, కార్మికుల బదిలీలు అత్యంత పారదర్శకంగా జరుగుతాయని, ఎక్కడా ఎవరికీ ఎటువంటి అన్యాయం జరగకుండా నాయకత్వం పర్యవేక్షణ చేస్తుందన్నారు. అంతా నిబంధనల ప్రకారం నిర్వహిస్తారన్నారు. అర్హులైన వారందరూ నిర్ణీత గడువులోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆ వివరాలను స్థానిక నాయకుల ద్వారా తమకు అందజేయాలన్నారు. ప్రస్తుతం పనిచేస్తున్న ప్రదేశాలలో ఏమైనా ఇబ్బందులు ఉంటే వాటిని పరిష్కరిస్తామన్నారు. సంఘం ఎదుగుదలకు అందరూ సమన్వయంతో పనిచేయాలని హితవు పలికారు. డివిజన్ కార్యదర్శి యు.శ్రీనివాస రావు, పార్వతీపురం బ్రాంచి అధ్యక్ష, కార్యదర్శులు పి.భాస్కరరావు, కె.రాము తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించండి

విజయనగరం దాసన్నపేట, ఆగస్టు 27: ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్లకు ఐదు నెలలుగా జీతాలు బకాయిలు ఉన్నారని, తక్షణమే ఇ వ్వాలని కోరుతూ సెప్టెంబరు 2న కలెక్టరేట్ ఎదుట ధర్నాకి వెళ్తున్నామని, ఆ రోజు విధులకు హాజరుకాలేమని యూ నియన్ కార్యదర్శి నందిని, సీఐటీయూ నగర అధ్యక్షులు జగన్మోహన్‌రావు తెలిపారు. మంగళవారం మండల విద్యా శాఖాధికారి సత్యవతిని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పనిభారం తీవ్రంగా ఉందని అనారోగ్యం వచ్చి నా సెలవులు లేవని, ఆరు వేల రూపాయల జీతంతో బతకడం కష్టమని కనీసం ఈ జీతాన్ని రూ. 10 వేలకు పెంచాలని కోరుతూ ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో యూనియన్ ప్రతినిధులు పార్వతి, సావిత్రి తదితరులు పాల్గొన్నారు. ● **శృంగవరపుకోట:** ప్రభుత్వ పాఠశాలలు, కళాశాల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి మ ద్దిల రమణ డిమాండ్ చేశారు. మంగళవారం శృంగవరపుకోట మండల విద్యాశాఖ కార్యాలయం వద్ద పారిశుధ్య కార్మికులు ధర్నా నిర్వహించారు. అనంతరం విద్యాశాఖాధికారులకు వినతిపత్రం అందించారు.



విజయనగరం ఘోషాసుపత్రిలో..



విజయనగరంలో..



ఎస్‌కోటలో..

ఐదు నెలలుగా తాలు అందించ కపో వడంపై మండిపడ్డారు. ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ● **విజయనగరం దాసన్నపేట:** ప్రభుత్వ ఆసుపత్రుల్లో, మెడికల్ కళాశాల్లో పనిచేస్తున్న శానిటేషన్, పెస్ట్ కంట్రోల్, సెక్యూరిటీగార్డులు, సూపర్‌వైజర్లు, కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించ కపోతే, ఆమరణ దీక్షకు దిగుతామని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ హెచ్చరించారు. మంగళవారం జిల్లా కేంద్రాసుపత్రి, ఘోషాసు పత్రి కార్మికులతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సెప్టెంబరు 5 లోపు సమస్యలు పరిష్కరించాలని, లేని పక్షంలో నిరసన కార్యక్రమం చేపడతామన్నారు. మూడు నెలలుగా ఉద్యమాలు చేస్తున్నప్పటికీ, పాలకులు, అధికారులు పట్టించుకోవండం లేదన్నారు.

రహదారి పాట్లు తప్పేదెప్పుడో?

- రోజురోజుకీ పెరుగుతున్న గోతుల పరిమాణం
- ప్రమాదాల బారిన పడుతున్న ప్రయాణికులు

గరుగుబిల్లి: పార్వతీపురం నుంచి పాలకొండ వైపు వెళ్లే ప్రధాన రహదారిలో పాట్లు తప్పుదెప్పుడోనని వాహనదారులు ఆశగా ఎదురు చూస్తున్నారు. గత ఐదేళ్ల వైసీపీ హయాంలో రహదారులను పట్టించుకోని పరిస్థితి నెలకొంది. దీంతో అడుగడుగునా గోతులమయంగా తయారయ్యాయి. ప్రధానంగా పార్వతీపురం, నవిరికాలనీ, అడ్డాపుశీల, ఉల్లిభద్ర, సంతోషపురం, ఖడ్గవలసతో పాటు జియ్యమ్మవలస మండలం పెదమేరంగి, సీమనాయుడువలస, బిత్రపాడు ప్రాంతాల వరకు రహదారి మార్గం భారీగా గోతులమయంగా మారింది. ఉల్లిభద్ర సమీపంలోని తోటపల్లి కుడి ప్రధాన కాలువపై నిర్మించిన ప్రధాన కల్వర్టు ప్రాంతం లోతట్టుగా ఉండటంతో వర్షపునీరు బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. గతంలో ఏర్పడిన గోతుల్లో వర్షపునీరు నిల్వ ఉండడంతో వాటి పరిమాణం రానురానూ పెరుగుతూ వస్తోంది. కల్వర్టుకు ఆనుకుని భారీ స్థాయిలో గోతులు ఏర్పడ్డాయి. రాకపోకలకు తీవ్ర అంతరాయం కలగడంతో సంబంధిత ఆర్‌అండ్‌బీ అధికారులు చిన్నపాటి మరమ్మతులను చేపట్టినా ఒక్క రోజు వ్యవధిలోనే పరిస్థితి మొదటికొస్తోంది. ఒక గోతిని పూడ్చితే మరో గోతి తయారవుతుంది. ఉల్లిభద్ర ప్రాంతంలో సుమారు 4 కిలో మీటర్ల మేర అడుగడుగునా గోతులే దర్శనమిస్తున్నాయి. బొబ్బిలి సమీపంలోని పారాది వంతెన బలహీనంగా ఉండటంతో భారీ వాహనాల రాకపోకలతో ప్రధాన రహదారి అత్యంత దారుణంగా తయారయ్యింది. ఈ మార్గంలో సాయంత్రం వేళల్లో ప్రయాణం చేయాలంటే వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. ఉదయం వేళల్లో దుమ్ము, ధూళి కారణంగా ఇబ్బంది పడగా, సాయంత్రం వేళల్లో రహదారి గోతులు కనిపించక ప్రమాదాల బారిన పడుతున్నారు. ఉల్లిభద్ర సమీపంలోని ఎర్రన్నగుడి సముదాయంలో రహదారి మొత్తం గోతులుగా తయారవ్వడంతో హెచ్చరికగా ఎర్ర జెండాను ఏర్పాటు చేశారు. పార్వతీపురం నుంచి శ్రీకాకుళం, జియ్యమ్మవలస, కురుపాం మండలాలతో పాటు అంతర్ రాష్ట్రాలకు వెళ్లాల్సిన ప్రధాన మార్గం అధ్వానంగా తయారైనా అధికారులు స్పందన అంతంత మాత్రంగానే కనిపిస్తోంది. కూటమి ప్రభుత్వంలోనైనా రహదారుల మెరుగుకు చొరవ చూపాలని వాహనదారులు కోరుతున్నారు. స్థానిక ఎమ్మెల్యే రహదారుల మెరుగుపడేందుకు అవసరమైన నిధులు మంజూరుకు చొరవ చూపాలని స్థానికులు కోరుతున్నారు. రహదారి నరకం నుంచి బయటపడేలా చొరవ చూపాలని వేడుకుంటున్నారు.


ఉల్లిభద్ర ప్రధాన మార్గంలో రహదారి గోతుల్లో నిలిచిన వర్షపు నీరు


ఎర్రన్నగుడి ప్రాంతంలో ఎర్ర జెండా ఏర్పాటు చేసిన దృశ్యం

మరింత బాధ్యతతో పని చేయాలి

● ఎస్పీ మాధవరెడ్డి


పదోన్నతి పొందిన పోలీసు అధికారితో కరచాలనం చేస్తున్న ఎస్పీ

బెలగాం: పదోన్నతి పొందిన తర్వాత విధి నిర్వహణలో మరింత బాధ్యత పెరుగుతుందని ఎస్పీ ఎస్వీ మాధవరెడ్డి అన్నారు. ఎస్ఐలుగా పదోన్నతి పొందిన ఇద్దరు అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్లు స్థానిక ఎస్పీ కార్యాలయంలో ఆయన్ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ వారిని అభినందించారు. విశాఖపట్నం రేంజ్ పరిధిలోని పార్వతీపురం మన్యం జిల్లాలోని పార్వతీపురం పోలీస్ స్టేషన్లో పని చేస్తున్న ఏఎస్ఐ వై.సురేష్, శ్రీకాకుళం జిల్లా జే.ఆర్.పురం పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐగా పని చేసిన పి.సత్యనారాయణలకు ఎస్ఐలుగా ఉద్యోగోన్నతలు లభించాయి. వీరిని పార్వతీపురం మన్యం జిల్లాలో పని చేసేందుకు విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపినాథ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్పీ మాట్లాడుతూ ఎస్ఐలుగా పదోన్నతి పొందిన వారికి జిల్లాలోని పోలీస్టేషన్లకు బదిలీ చేస్తామని చెప్పారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని వారికి దిశానిర్దేశం చేశారు. అలాగే మక్కువ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న వై.ఫైడయ్యకు హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి కల్పించారు. ఆయన కూడా మర్యాద పూర్వకంగా ఎస్పీని కలిశారు.

రోడ్లపై పందులు, ఆవుల సంచారం నిషేధం

పాలకొండ: నగరపంచాయతీ పరిధిలోని ప్రధాన రహదారులు, ప్రధాన కూడళ్లలో పందులు, ఆవులు సంచారాన్ని నిషేధిస్తున్నామని నగర పంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావు తెలిపారు. ఆయన మంగళవారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. యజమానులు ఆవులను తమ ఇంటి ఆవరణలో, పందులను పట్టణానికి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉంచుకోవాలని ఆయన సూచించారు. రాష్ట్ర పురపాలక శాఖా మంత్రి నారాయణ ఆదేశాల మేరకు సెప్టెంబరు 10వ తేదీ వరకు సమయం కేటాయిస్తున్నామని, ఆలోగా వారి సంరక్షణలో ఉన్న ఆవులను, పందుల ను నిర్దీత ప్రదేశాల్లో ఏర్పాటు చేసుకోవాలన్నారు. అలాకాకుండా సెప్టెంబరు 10 తర్వాత పట్టణంలోని ప్రధాన రహదారులు, కూడళ్లలో ఎక్కడ కనిపించినా వాటిని నగర పంచాయతీ సిబ్బంది స్వాధీనం చేసుకుని పట్టణానికి దూరంగా అడవుల్లో వదిలివేయాల్సి వస్తుందని హెచ్చరించారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం తగదు


బొడ్డవలసలో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఏటీడబ్ల్యూవో

జియ్యమ్మవలస: మండలంలోని పలు పాఠశాలలను ఏటీడబ్ల్యూవో కె.చంద్రబాబు మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఉదయం జియ్యమ్మవలస పంచాయతీ బొడ్డవలస ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. ఆ పాఠశాలలో ఏకోపాధ్యాయుడుగా పనిచేస్తున్న అంకలాపు భాస్కర రాయుడు విధి నిర్వహణలో నిర్లక్ష్యం ఉన్నట్టు గుర్తించి మందలించారు. పరిస్థితిని మార్చుకోకపోతే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. తరువాత వనజ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల, జియ్యమ్మవలస గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలను సందర్శించారు. అయితే ఈ రెండు పాఠశాలల్లో విద్యా బోధన, మెనూ అమలు తీరు, రికార్డుల నిర్వహణ, స్టాక్‌లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ రెండు ఉన్నత పాఠశాలల్లో గణితం, ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుల కొరత ఉందని హెచ్ఎంలు ఎ.రవిప్రసాద్, ధనుంజయనాయుడులు ఏటీడబ్ల్యూవో దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఏటీడబ్ల్యూవో చంద్రబాబు విషయాన్ని డీడీ దృష్టికి తీసుకెళ్లి త్వరలో ఉపాధ్యాయులను నియమించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

అదనపు భవన పనులు వేగవంతం చేయాలి

గరుగుబిల్లి: రోగులకు అసౌకర్యం కలగకుండా ఉండేందుకు ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో అదనపు భవనాలు మంజూరు చేసిందని ఆర్‌అండ్‌బీ జేఈ పి.ప్రమీల తెలిపారు. గరుగుబిల్లి పీహెచ్‌సీ ప్రాంతంలో రూ.50లక్షలతో చేపడుతున్న అదనపు భవన నిర్మాణ పనులను ఆమె మంగళవారం పరిశీలించారు. నిర్మాణ పనులు నిర్దేశించిన సమయానికి నాణ్యతతో పూర్తి చేయాలన్నారు. జిల్లాకు సంబంధించి వసతి సమస్య ఉన్న ఆరోగ్య కేంద్రాల్లో వైద్యశాఖకు చెందిన నిధులు మంజూరయ్యాయన్నారు. అలాగే పార్వతీపురం నుంచి పాలకొండ వైపు వెళ్లే ప్రధాన రహదారి మార్గానికి రూ.5 కోట్లుతో ప్రతిపాదనలను ఉన్నతాధికారులకు పంపించారని చెప్పారు. రహదారి సమస్యను ఉన్నతాధికారులకు నివేదించామని, నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభమవుతాయని ఆమె తెలిపారు.

కొండల్లో మైనింగ్ ఆపాలి


గోముఖి కాజ్‌వేను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

సాలూరు రూరల్: ఏవోబీ కొండల్లో మైనింగ్ నిలిపివేసి నదులపై వంతెనలు నిర్మించాలని సీపీఎం మండల కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. తోణాం పంచాయతీ దిగువ మెండంగి కాజ్‌వేను సీపీఎం మండల నాయకులు సుందరరావు, అయోధ్య తదితరులు మంగళవారం పరిశీలించారు. ఈసందర్భం గా ఆయన మాట్లాడారు. మైనింగ్ పేరుతో అడవుల ధ్వంసం చేయడం తగదన్నారు. ప్రకృతి అందాలకు నిలయమైన శిఖపరువును పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని కోరారు. దిగుమెండంగి వద్ద గోముఖీ నదిపై వంతెన నిర్మించాలన్నారు. ఈ వంతెన వల్ల పట్టుచెన్నారు, పగులుచెన్నారు తదితర పంచాయతీల్లో పలు గ్రామాల గిరిజనులకు మేలు జరుగుతుందన్నారు. గిరిజన గ్రామాలకు మౌళిక సదుపాయాలు కల్పించాలన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించండి

సాలూరు రూరల్: విద్యారంగ సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం సత్వరమే చొరవ చూపాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం(ఆపస్) రాష్ట్ర సహా అధ్యక్షుడు జాగాన రామునాయుడు కోరారు. సాలూరు మండలం నెలిపర్తి, మామిడిపల్లి తదితర పాఠశాలల్లో మంగళవారం ఆయన ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం సత్వర చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నాలి చంద్రశేఖర్, వెంకటరమణ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.


వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక చర్యలు

గరుగుబిల్లి: గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా అవసరమైన చర్యలు చేపడుతున్నామని మండల పంచాయతీ విస్తరణాధికారి ఎల్.గోపాలరావు తెలిపారు. మంగళవారం గొట్టివలస గ్రామంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో వైరల్ జ్వరాలు ఉన్న నేపథ్యంలో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. వైద్య సిబ్బంది విధుల నిర్వహణపై అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు తిరుపతి భాస్కరరావు, భార్గవనాయుడు, సిబ్బంది మంగమ్మ, సూర్యకుమారి, మాజీ సర్పంచ్ బోను అప్పలస్వామి, తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్ సీసీ రోడ్డుకు ప్రతిపాదనలు

గుమ్మలక్ష్మీపురం: ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి గిరిజన సంక్షేమ ఇంజనీర్లకు ఆదేశించారు. ఈ మేరకు రూ.35లక్షలతో ఈ సీసీ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేశారు. గుమ్మలక్ష్మీపురం సర్పంచ్ బొత్తాడ గౌరీశంకరరావు తదితర గ్రామ పెద్దల వినతి మేరకు ఎమ్మెల్యే జగదీశ్వరి సీసీ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదన సిద్ధం చేయించారు.

హెల్మెట్ తప్పనిసరి


గరుగుబిల్లి: అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రమేష్‌నాయుడు

సీతానగరం: మండలంలోని నర్సాపేట షుగర్ ఫ్యాక్టరీ వద్ద ఎస్ఐ ఎం.రాజేష్ మంగళవారం వాహనాల తనిఖీ నిర్వహించి, కేసులు నమోదు చేశారు. ఈసందర్భంగా వాహనదారులకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకపోతే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ● **గరుగుబిల్లి:** ప్రతిఒక్కరూ రహదారి నిబంధనలు పాటించాలని ఎస్ఐ రమేష్‌నాయుడు సూచించారు. మంగళవారం ఉల్లిభద్ర సముదాయంలో వాహనదారులకు ఆయన అవగాహన కల్పించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

చెత్తను తొలగించాలని నిరసన


నిరసన తెలుపుతున్న పట్టణవాసులు

పాలకొండ: పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయం ఎదురుగా ఉన్న చెత్తను తక్షణమే తొలగించాలని పాలకొండ పట్టణ పౌర సంఘాల ఐక్యవేదిక నాయకుడు దావాల రమణారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు నగర పంచాయతీ కార్యాలయం ఎదుట మంగళవారం ఆ ప్రాంత ప్రజలతో నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం నగర పంచాయతీ మేనేజర్‌కు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా రమణారావు మాట్లాడుతూ పట్టణంలోని చెత్తను తీసుకొచ్చి కార్యాలయం ముందు వేయడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. కార్యాలయంతో పాటు గ్రంథాలయం, చేపల మార్కెట్ కాయగూరల మార్కెట్‌కు వెళ్లి వచ్చేవారు దుర్గంధాన్ని భరించలేకపోతున్నారని చెప్పారు. తక్షణమే చెత్తను తొలగించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ప్రజా ఉద్యమాలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసనలో టి.జగదీష్, సతీష్, లలిత, భాను, రాజశేఖర్, శ్రీనివాసరావు తదితరులున్నారు.

యూటీఎఫ్ స్వర్ణోత్సవాల పోస్టర్ విడుదల

సీతానగరం: వచ్చే నెల 20, 21 తేదీల్లో జరగబోయే యూటీఎఫ్ జిల్లా స్వర్ణోత్సవాలను పురస్కరించుకుని స్థానిక మండల విద్యా వనరుల కేంద్రం వద్ద మంగళవారం పోస్టర్‌ను విడుదల చేశారు. ఈసందర్భంగా యూటీఎఫ్ మండల నాయకులు మాట్లాడుతూ జిల్లా కేంద్రం పార్వతీపురంలో జరగబోయే స్వర్ణోత్సవ కార్యక్రమానికి విస్తృత ప్రచారం చేపట్టి, అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు హాజరు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పల్లి శ్రీనివాసరావు, బొత్స ప్రసాదరావు, జిల్లా కౌన్సిల్ సభ్యులు మర్రాపు గోవిందరావు, మండల కార్యవర్గ సభ్యులు బూరాడ ఆదినారాయణ, ఆది, వెన్నెల శంకరరావు, కె.మురళీ, నాగులకొండ త్రినాద్, తదితరులు పాల్గొన్నారు.

అనధికార కొళాయి కనెక్షన్లపై ఆరా

సాలూరు రూరల్: తోణాం గ్రామంలో అనధికార కొళాయి కనెక్షన్లపై ఎంపీడీవో గొల్లపల్లి పార్వతి ఆరా తీశారు. తోణాంలో అనధికార కొళాయి కనెక్షన్లు తొలగించాలని మంత్రి సంధ్యారాణి ఆమెను ఆదేశించారు. ఈ మేరకు ఆమె మంగళవారం తోణాం వెళ్లి కొళాయి కనెక్షన్లు పరిశీలించారు. గ్రామంలో పదికి పైగా అనధికార కొళాయి కనెక్షన్లు ఉన్నట్టు తెలుసుకున్నారు. గ్రామంలో అనధికార కొళాయి కనెక్షన్లు గుర్తించి బుధవారం నాటికల్లా వాటిని తొలగించి, నివేదిక ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శి ఆలీషాను ఆదేశించారు.

పూర్తి స్థాయిలో సర్వే నిర్వహించాలి

గరుగుబిల్లి: రెవెన్యూ గ్రామాల పరిధిలో రికార్డుల మేరకు విస్తీర్ణంపై పూర్తిస్థాయిలో సర్వే నిర్వహించాలని మండల ఇన్‌చార్జి తహసీల్దార్ పి.సత్యలక్ష్మికుమార్ సూచించారు. మండలంలోని శివరాంపురం, గరుగుబిల్లితో పాటు పలు గ్రామాల్లో నిర్వహించిన సర్వేను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయిలో భౌగోళికంగా విస్తీర్ణం ఎంతమేర ఉందన్న దానిపై సర్వే నిర్వహించాలని ఉన్నతాధికారులు ఆదేశించారన్నారు. ఈ మేరకు రెవెన్యూ గ్రామానికి సంబంధించి వీఆర్వో, సర్వేయర్, వ్యవసాయ సిబ్బందిని నియమించారన్నారు. మండలం మొత్తంపై 33 రెవెన్యూ గ్రామాల్లో సర్వే నిర్వహిస్తామని తెలిపారు. వెబ్‌ల్యాండ్‌లో ఉన్న విస్తీర్ణానికి, భౌగోళికంగా ఉన్న విస్తీర్ణానికి సరిపడాలన్నారు. రెవెన్యూ రికార్డుల్లో తేడాలు ఉండటంతో ఈ మేరకు సర్వే నిర్వహించాలని ఆదేశాలు జారీ అయ్యాయన్నారు. సర్వే, సబ్ డివిజన్‌తో పాటు క్షేత్రస్థాయిలో పంటలు సాగు చేస్తున్నారా లేదా, సాగు చేయడం లేదా, ఎన్నేళ్ల నుంచి పంటలు వేయలేదు అన్న సమాచారం సేకరిస్తున్నట్లు తెలిపారు. సంబంధిత సిబ్బంది క్షేత్రస్థాయిలో నిశితంగా పరిశీలించి నివేదికలు అందించాలని సూచించారు. ఈ పరిశీలనలో వీఆర్వో బాలబాబు, నాగరాజు, తదితరులు ఉన్నారు.

బస్సు సౌకర్యం కల్పించండి


ఆర్టీసీ డీఎంతో మాట్లాడుతున్న ఎంపీపీ సురేష్

జియ్యమ్మవలస: మండలంలో పలు గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని మండల పరిషత్ అధ్యక్షుడు బొంగు సురేష్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దత్తి లక్ష్మణరావు, అరకు పార్లమెంటు నియోజకవర్గ టీడీపీ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ కోరారు. మంగళవారం వీరు పార్వతీపురం ఆర్టీసీ డిపో మేనేజర్ కనకదుర్గను కలిసి, పరిస్థితిని వివరించారు. మండలంలో గెడ్డతిరువాడ, పెదబుడ్డిడి, శిఖబడి, చినకుదమ, టీకే జమ్ము, తదితర గ్రామాలకు బస్సు సౌకర్యం లేక విద్యార్థులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆమె దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఆమె ఈ రూట్లను పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

డీడీ కార్యాలయం సీతంపేటలోనే కొనసాగించాలి

సీతంపేట: జిల్లా గిరిజన సంక్షేమశాఖ డీడీ కార్యాలయం సీతంపేటలోనే కొనసాగించాలని ఆదివాసీ జేఏసీ నాయకులు స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణను కోరారు. ఈ మేరకు మంగళవారం రాజపురం క్యాంప్ కార్యాలయంలో ఆయన్ని కలిసి వినతిపత్రం అందించారు. డీడీ కార్యాలయం సీతంపేటలో కొనసాగించే విధంగా తాను పూర్తిస్థాయిలో దృష్టిసారిస్తానని, ఈ విషయం కలెక్టర్‌తో మాట్లాడుతానని ఎమ్మెల్యే హామీనిచ్చినట్టు ఆదివాసీ జేఏసీ నాయకులు రామ్మోహన్, రమేష్, వినోద్, తిరుమల, నరేష్, హిమరిక ప్రసాద్ తెలిపారు.

సస్యరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి

సాలూరు రూరల్: పంటల సాగులో సస్యరక్షణకు రైతులు ప్రాధాన్యం ఇవ్వాలని వ్యవసాయశాఖ జిల్లా పరిశోధన కేంద్రం(డీఆర్సీ) ఏడీఏ భారతి పిలుపునిచ్చారు. మంగళవారం శివరాంపురంలో ఏవో అనురాధ పండా ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడారు. వరిలో ప్రస్తుతం కాండం తొలుచు పురుగు, ఆకుముడత తెగులు అక్కడక్కడ వస్తుందన్నారు. వాటిని నివారణకు సత్వర సస్యరక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఏవో మాట్లాడుతూ రైతులు సేంద్రియ సాగు చేపట్టాలని సూచించారు. వివిధ కషాయాల తయారీపై ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ జరజాపు మోహన్‌రావు, వ్యవసాయ సిబ్బంది వెంకటేష్ పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

గుమ్మలక్ష్మీపురం: మండలంలో ఉన్న రైతులందరూ వరి పంటల్లో యాజమాన్య పద్ధతులను పాటించాలని మండల వ్యవసాయాధికారి సీహెచ్.ప్రసాదరావు కోరారు. మంగళవారం ఆయన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బీరుపాడు, గొయ్యిపాక రైతు సేవా కేంద్రాల్లో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని, మాట్లాడారు. రైతులు ఈ పంట నమోదును చేసుకోవాలన్నారు. వేప కషాయం, ద్రవ జీవామృతం తయారీ, ఉపయో గించే విధానంపై ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి తెలిపారు. ఈ కార్య క్రమంలో వ్యవసాయ శాఖ సహాయకులు సామల సాయికిరణ్, కిల్లక మిన్నారావు పాల్గొన్నారు.


సాలూరు రూరల్: మాట్లాడుతున్న డీఆర్సీ ఏడీఏ భారతి

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడి

వీరఘట్టం: మండలంలోని కెఇచ్ఛాపురం గ్రామంలో మంగళవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఏడీఏ రత్నకుమార్ మాట్లాడుతూ రైతులు రసాయన ఎరువులు కంటే సేంద్రియ ఎరువులు వాడకం వల్ల అధిక దిగబడులు సాధించవచ్చునని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏవో సౌజన్యం, సర్పంచ్ బిడ్డిక గౌరునాయుడు, ఏఆర్ఎస్ సీతంపేట సైంటిస్ట్ లక్ష్మి, విలేజ్ వ్యవసాయ సహాయకులు, వెటర్నరీ లైవ్ స్టాక్ అసిస్టెంట్ రమణమూర్తి, ఏపీసీఎన్ఎఫ్ మండల యాంకర్ సింహాచలం, రైతులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న శ్రీకృష్ణ వేషధారణ పోటీలు

ఒడిశా


పోటీల్లో పాల్గొన్న చిన్నారులతో నిర్వాహకులు

రాయగడ: హైందవ సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవడం చాలా ముఖ్యమని సబ్ కలెక్టర్ కళ్యాణి సంఘమిత్ర దేవి అన్నారు. శ్రీకృష్ణ జన్మష్టామి వేడుకల్లో భాగంగా మంగళవారం స్థానిక లైన్స్ క్లబ్ హాలులో క్లబ్ యంగ్ ఇండియా నిర్వహించిన శ్రీకృష్ణ వేషధారణ పోటీల్లో ఆమె ముఖ్యఅతిథి పాల్గొన్నారు. ఈ పోటీలలో వివిధ పాఠశాలలకు చెందిన 50 మంది చిన్నారులు పాల్గొన్నారు. వీరిలో మేఘల్ యాదవ్, అన్సిత మహాపాత్ర, ఈవీ సంపత్‌లు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను గెలుచుకున్నారు. మరో పదిమంది చిన్నారులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. న్యాయ నిర్ణేతలుగా పింకి రథో, ప్రభాకర్ మిశ్రా, సూర్యానారాయణ మిశ్రా వ్యవహరించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు సురేంద్రసాహు, ఉపాధ్యక్షుడు డా.వై.ఆర్‌రావు, కార్యదర్శి దీపక్ కుమార్ పృష్టి, సహ కార్యదర్శి గౌరీశంకరరావు, కోశాధికారి చిన్నారి, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

మిస్ ఇండియా ఫైనల్ రౌండ్‌లో ఒడిశా యువతి


అనన్య పండా

రాయగడ: ఒడిశా రాష్ట్రానికి చెందిన కటక్ నివాశి అనన్యపండా ఫెమినా మిస్ ఇండియా-2024 పోటీల్లో ఫైనల్ రౌండ్‌కు చేరుకుంది. ఆగస్టు 8న కోల్‌కతాలో జరిగిన ఈస్ట్‌జోన్ తొలి ఎడిషన్‌లో ఐదో స్థానం దక్కించుకున్న పండా.. ఆగస్టు 14న ముంబైలో జరిగిన రెండో ఎడిషన్‌లో ఫైనల్ రౌండ్‌లో స్థానం దక్కించుకుంది. ఈ విషయాన్ని మంగళవారం ఫెమినా నిర్వాహకులు తెలిపినట్టు ఆమె ప్రకటించారు. ముంబైలో అక్టోబరు నెలలో ఫైనల్ పోటీలు జరగనున్నాయని తెలిపారు. విశ్రాంత నేవీ అధికారి అయిన తన తండ్రి సిద్ధార్థపండా పూర్తి సహకారం ఉందని అనన్య తెలిపారు.

క్లుప్తంగా..

ఉచిత నేత్ర వైద్య శిబిరం

పాలకొండ: పాలకొండ సత్యసాయి మందిరంలో మంగళవారం సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో విశాఖపట్నం శంకర్‌ఫౌండేషన్ కంటి ఆసుపత్రి సహకారంతో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 111 మంది కంటి పరీక్షలు చేసుకోగా అందులో 40 మందికి కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. సత్యసాయి మందిరం కన్వీనర్లు సుధాకర్, ఆర్.కిషోర్, ఇతర క్రియాశీలక సభ్యులు పాల్గొన్నారు.

నేడు వాహనాలకు వేలం

పాలకొండ: ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన వివిధ వాహనాలను బుధవారం బహిరంగ వేలం వేయనున్నట్టు ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ జి.శ్రీనివాసు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పాలకొండలోని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్‌లో వేలంపాట నిర్వహించనున్నట్టు తెలిపారు. వేలంలో పాల్గొనేవారు రూ.1000 ధరావత్తు చెల్లించాలన్నారు. వేలంలో వాహనాలను పొందినవారు చలానా రూపంలో మొత్తం డబ్బును చెల్లించాలని చెప్పారు.

విజయనగరం కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే జగదీశ్వరి


కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే

గుమ్మలక్ష్మీపురం: కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి విజయనగరం కలెక్టర్ అంబేడ్కర్‌ను మంగళవారం విజయనగరంలో గౌరవపూర్వకంగా కలిశారు. గిరిజన ప్రజలు తనపై నమ్మకంతో ఎమ్మెల్యేగా గెలిపించారని, వారి సమస్యలు పరిష్కారానికి తమ సహకారం ఉండాలని విజ్ఞప్తి చేశారు.

చింతల పోలమ్మతల్లికి ఎమ్మెల్యే జయకృష్ణ పూజలు


ఘటంతో అమ్మవారి వద్దకు బయలుదేరిన ఎమ్మెల్యే

వీరఘట్టం: ఎం.రాజపురంలో గ్రామదేవత చింతల పోలమ్మ తల్లికి పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ మంగళవారం పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మాజీ ఇన్‌చార్జి నిమ్మక పాండురంగ, నిమ్మక కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు, పాలకొండ నియోజకవర్గానికి సంబంధించిన వివిధ మండలాల నాయకులు పాల్గొన్నారు.

పింఛన్‌దారుల వివరాలు అందజేయండి

వీరఘట్టం: వీరఘట్టం పంచాయతీ పరిధిలో మంగళవారం ఉపాధి హామీ పథకం సోషల్ ఆడిట్‌లో భాగంగా సమావేశం నిర్వ హించారు. ఈ సమావేశంలో ఆ గ్రామ టీడీపీ నాయకుడు బల్లా హరి బాబు.. గ్రామంలో పింఛన్‌దారుల వివరాలు, జాబ్‌కార్డులు వివరాలు అందజేయాలని ఏపీవో జి.సత్యంనాయుడును కోరారు. ఈ కార్యక్ర మంలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, అధికారులు పాల్గొన్నారు.

మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలి

పార్వతీపురంటౌన్: విద్యార్థులు అంబేడ్కర్, వివేకానంద, గాంధీజీ వంటి మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా కోర్టు లోక్ అదాలత్ సభ్యుడు టి.జోగారావు అన్నారు. మంగళవారం ఆయన స్థానిక ఆశాజ్యోతి ఆశ్రమాన్ని సందర్శించారు. విద్యార్థుల యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు ప్రతి విద్యార్థి వద్ద ఆధార్ కార్డు తప్పనిసరిగా ఉండాలన్నారు. న్యాయవాదులు వెంకటరమణ, పర్వయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలు కల్పించాలి

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: గత ఐదేళ్లగా ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో పనిచేస్తూ రెగ్యులర్ సిబ్బంది రావడంతో ఉపాధి కోల్పోయిన వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని గిరిజన విద్యార్థి సంఘం, గిరిజన సంక్షేమ సంఘం తదితర సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయం వద్ద నిరసన దీక్షలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు పి.రంజిత్‌కుమార్, పి.సురేష్, ఆర్.శశిభూషణ్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ దృష్టికి రైతుల సమస్యలు

పాలకొండ: స్థానిక తహసీల్దార్ ఆర్.బాలమురళీకృష్ణను అభ్యుదయ రైతు ఖండాపు ప్రసాదరావు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానికంగా ఉన్న రైతుల సమస్యలపై ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. అనంతరం ప్రసాదరావు తన వ్యవసాయ క్షేత్రంలో పండించి నల్ల బియ్యాన్ని తహసీల్దార్‌కు అందించారు.